నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం 7

జగ్గంపేటలో అదుపు తప్పిన స్కూల్ బస్సు

సత్యదేవుడి సన్నిధిలో నీటికొరత కారణంగా ఏసీ గదుల నిలుపుదల

» ఉన్నతాధికారులు వివరణ కోరడంతో పునరుద్ధరణ 7

పిఠాపురం రూరల్ ఎస్ఐకి రిమాండ్

» వచ్చేనెల 8 వరకు రిమాండ్ విధించిన ఏసీబీ కోర్టు 7

మెయిన్‌లో..

ఛత్తీస్‌గడ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి

ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేస్తాం

» జేసీ రాహుల్‌మీనా

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో ఇంకా రైతులవద్ద ఉన్న ధాన్యాన్ని ఈనెల 31 వరకు కొనుగోలు చేస్తామని జిల్లా జేసీ రాహుల్‌మీనా తెలిపారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన వెలువరించారు. రైతులు తమవద్ద ఉన్న ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకుతరలించాలన్నారు. క్వింటాలు కామన్‌రకం రూ.2300, గ్రేడ్-ఏరకం రూ.2320కు విక్రయించవచ్చునని సూచించారు.

ఆశల పల్లకి

» జిల్లా ప్రజల తలసరి ఆదాయం.. రూ.2,74,132

» వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.3,17,676కు పెరిగే అవకాశం

» కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వశాఖల పనితీరు గణాంకాలు వెల్లడి

» జిల్లా జీడీపీ రూ.69,225కోట్లు దాటుతుందని అంచనా

» గ్రీవెన్స్ పనితీరు బాగుందని 87.84శాతం మంది కితాబు

» ఓవరాల్ గ్రీవెన్స్ పనితీరులో జిల్లాకు 13వ ర్యాంకు

» జీజీహెచ్ అభివృద్ధికి రూ.500కోట్లు, ఏలేరు ఆధునీకరణకు రూ.848కోట్లు కోరిన కలెక్టర్

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

జిల్లా ప్రజల తలసరి ఆదాయం రానురాను పుంజుకుంటోంది. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు ప్రామాణికంగా భావించే తలసరి ఆదాయం ఏటేటా వృద్ధి చెందుతోంది. ఫలితంగా జిల్లా ప్రజల తలసరి ఆదాయం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.2,74,132గా ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాల్లో మరింత అభివృద్ధి సాధించడం ద్వారా ప్రజల తలసరి ఆదాయం రూ.3,17,676కు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. వాస్తవానికి జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగాలకు సంబంధించి సాధించే ఉత్పత్తి విలువను గణించి దాన్ని జిల్లా జనాభాతో భాగించి తలసరి ఆదాయాన్ని లెక్కిస్తారు. దీని ప్రకారం జిల్లా ప్రజల తలసరి ఆదాయంలో అనేక జిల్లాలతో పోల్చితే మెరుగ్గా ఉంది.

కలెక్టర్ల సదస్సు ప్రారంభం

అమరావతిలో జిల్లా కలెక్టర్ల సదస్సు మంగళవారం ప్రారంభమైంది. ఇందులోభాగంగా జిల్లాలకు సంబంధించిన జీడీపీ, తలసరి ఆదాయ లెక్కలు, వివిధ శాఖల పనితీరుపై ప్రభుత్వం నివేదిక విడుదల చేసింది. అందులో భాగంగా జిల్లా జీడీపీకి సంబంధించి వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక, సేవల రంగాల్లో జీడీపీ 2022-2023లో రూ.54,902కోట్లుగా నమోదైంది. 2023-2024లో రూ.61,336, 2024-2025లో రూ.69,225 కోట్లుగా తేలింది. 2025-2026నాటికి 17శాతం వృద్ధితో రూ.80,247కోట్ల వరకు పెరగవచ్చని అంచనా వేసింది. రాష్ట్ర జీడీపీలో జిల్లా గ్రాస్‌డిస్ట్రిక్ట్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌వాటా 4.31శాతంగా నమోదైంది.



కలెక్టర్ల సదస్సులో ఎస్పీతో కలిసి పాల్గొన్న కలెక్టర్ షాన్‌మోహన్

గృహాలు.. జనాభా..

కాకినాడ జిల్లాలో మొత్తం 7,52,866 గృహాలు ఉండగా వీటిలో 6,43,850 ఇళ్లకు సంబంధించి జియోకోర్డినేట్స్‌ను గుర్తించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇంకా 54,270మంది పిల్లలకు ఆధార్ లేదని గుర్తించారు. వర్క్‌ఫ్రం హోంకింద సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తోన్న వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ఇటీవల సర్వే ప్రారంభించింది. దీని ప్రకారం జిల్లాలో 5,33,552 గృహాల్లోని 11,64,813 మంది నివసిస్తుండగా, ఇంతవరకు 7,53,805మంది జనాభాకు సంబంధించి సర్వే పూర్తయిందని వివరించింది.

గ్రీవెన్స్ భేష్

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 26,481 గ్రీవెన్స్ ఫిర్యాదులు వచ్చాయని ప్రభుత్వం ప్రకటించింది. గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలనుంచి కొన్ని విషయాల్లో సర్వే నిర్వహించగా వచ్చిన ఫలితాలను వెల్లడించింది. గ్రీవెన్స్‌సెల్ సేవల గురించి ఇతరులకు చెబుతారా అని ప్రభుత్వం సర్వే చేయగా, చెబుతామని 87.84శాతంమంది తెలిపారు. 2.17శాతం మంది కాదని చెప్పారు. గ్రీవెన్స్‌లో అధికారులు మీపట్ల మర్యాదగా ప్రవర్తించారా అంటే సర్వే జరిపిన 438మందిలో 9మంది చాలా బాగా అని, 83మంది బాగా ప్రవర్తించారని, ప్రవర్తన సరిగ్గా లేదని ఆరుగురు తెలిపినట్లు ప్రభుత్వం తన నివేదికలో వివరించింది. అన్ని అంశాల్లో గ్రీవెన్స్ పనితీరులో జిల్లా కు 13వ ర్యాంకు లభించింది. 70.60శాతం పాయింట్లు జిల్లాకు దక్కాయి. శాఖల పనితీరు బాగోలేదని వన్‌స్టార్ కింద 21.5శాతంమంది, సంతృప్తికరంగా ఉందని ఫైవ్‌స్టార్ విభాగంలో 16.8 శాతం మంది పాయింట్లు ఇచ్చారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి జిల్లాలో కూలీలకు పనిదినాలు కల్పించడం ద్వారా రూ.153.91 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ నిధులు సాధించాల్సి ఉండగా, రూ.156.48కోట్లు సాధించింది. వేసవి నేపథ్యంలో జిల్లాలో 20 మండలాల్లో నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు తాగునీటి సరఫరాకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. జిల్లాలో 2019 నుంచి 2024 వరకు 11 అట్రాసిటీ కేసుల్లో హత్యలు జరగ్గా, బాధితుల్లో 8మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు నివేదిక పేర్కొంది.

నిధులు ఇస్తే ప్రగతే..

జీజీహెచ్‌లో కొత్తబ్లాక్‌ల నిర్మాణానికిరూ.500 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఏలేరు ఆధునీకరణకు రూ.848.79కోట్లు, పీఎంసీకి రూ.20కోట్లు విడుదల చేయాలని కోరారు. ఉప్పాడవద్ద సముద్రపుకోత అధికంగా ఉన్నందున 4కిలోమీటర్ల మేర రక్షణగోడ నిర్మాణానికి రూ.323కోట్లు విడుదల చేయాలని కోరారు. ఇప్పటివరకు సముద్రంలో 764హెక్టార్ల భూభాగం కలిసిపోగా 1,751కుటుంబాలు నష్టపోయాయని వివరించారు. కీలకమైన స్మార్ట్‌సిటీకి మ్యాచింగ్ గ్రాంట్ కింద రాష్ట్రప్రభుత్వం బాకీపడ్డ రూ.194కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.స్మార్ట్‌సిటీలో రూ.645కోట్ల విలువైన 56 ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తి చేసుకోగా, రూ.276 కోట్ల విలువైన 14 ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. డిపాజిటర్లకు శఠగోపం పెట్టిన జయలక్ష్మి సొసైటీ ఆస్తులను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కిర్లంపూడి, ఏలేశ్వరం సహకార సొసైటీల్లో ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపించాలనికోరారు.

ఆస్తి పన్ను బకాయిదారులకు మున్సిపల్‌శాఖ శుభవార్త

» పెండింగ్ వడ్డీ బకాయిల్లో 50శాతం రాయితీ

కార్పొరేషన్(కాకినాడ)/పిఠాపురం/ సామర్లకోట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను బకాయిదారులకు మున్సిపల్ శాఖ శుభవార్త చెప్పింది. ఆస్తిపన్నుపై వడ్డీలో రాయితీ ప్రకటిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెలాఖరు వరకు పెండింగ్ ఉన్న వడ్డీ బకాయిల్లో 50శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పేరుకుపోయిన కోట్లాది రూపాయిల ఆస్తి పన్ను వసూలుకోసం ప్రభుత్వం రాయితీ నిర్ణయం తీసుకుంది. పన్ను బకాయిదారులు వారికి ఉన్న మొత్తం బకాయిలను, ప్రస్తుత సంవత్సరం పన్నును ఒకేసారి చెల్లిస్తే వారికి ఉన్న వడ్డీలో 50శాతం రాయితీ వస్తుంది. అంటే పన్ను కట్టేటప్పుడు 50శాతం వడ్డీ తగ్గింపుతో పన్ను చెల్లించవచ్చు. ఇప్పటికే కొంత మొత్తం చెల్లించిన వారు మిగతా మొత్తం ఒకేసారి చెల్లిస్తే ఇప్పటికే చెల్లించిన వడ్డీలో 50శాతం వచ్చే సంవత్సరానికి అడ్వాన్స్ టాక్స్‌గా పరిగణిస్తారు. ఈ మేరకు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల పరిధిలో ఆస్తి, ఖాళీస్థలాల పన్ను బకాయిలను ఏక మొత్తంగా చెల్లించి వడ్డీలో 50శాతం రాయితీ పొందాలని కమిషనర్ కనకారావు కోరారు. ఈ అవకాశాన్ని సత్వరం సద్వినియోగం చేసుకుని మునిసిపాల్టీ అభివృద్ధికి దోహదపడాలని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య కోరారు. పన్నుబకాయిలు నెలాఖరులోగా ఏకమొత్తంగా చెల్లించి 50శాతం మాఫీ పొందాలని, ఇందుకోసం సెలవు దినాల్లోను ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.

131మంది ఎంపిక

» కలెక్టరేట్‌లో ముగిసిన రెండురోజుల జాబ్‌మేళా 7



కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనాను కలిసిన ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

విజ్ఞాన, విహార యాత్రకు బృందం ఎంపిక

కాకినాడరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనిఅన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 126మంది విద్యార్థులు, 15మందిఉపాధ్యాయుల బృందాన్ని విజ్ఞాన, విద్యా విషయక విహార యాత్రకు ఎంపిక చేసినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఈ బృందాన్ని యానాం, తిరుపతిలోని ఐఐటీ, ఐసర్‌ల సందర్శనకు బుధవారం పంపించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. ఈ యాత్రకు సంబంధించిన గోడపత్రికను డీఈవో మంగళవారం ఆవిష్కరించారు. ఐఐటీ, ఐసర్‌ల్లోని ప్రొఫెసర్లతో విద్యార్థులు,ఉపాధ్యాయులు నేరుగా సంభాషించి అక్కడ ఉన్న అత్యుత్తమ ల్యాబ్‌లను సందర్శించడానికి వీలు కలుగుతుందన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస వినీల్, ఏఎంవో వెంకటరామారెడ్డి, కాజులూరు ఎంఈవోలు డేవిడ్, జాన్, నారాయణమూర్తి పాల్గొన్నారు.



యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో పి.రమేష్

నిత్యావసరాల ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ),మార్చి 25(ఆంధ్రజ్యోతి): నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు, ఇతర పప్పుధాన్యాలు, కూరగాయలు అందుబాటు ధరల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని జేసీ రాహుల్‌మీనా ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు ధరల వ్యత్యాసాలను పరిశీలించాలన్నారు. కందిపప్పు, ఇతర పప్పుధాన్యాలు ధరలు అందుబాటులో ఉన్నదిలేనిదీ సంబంధిత హోల్‌సేలర్లు, రిటైలర్లను అడిగి తెలుసుకున్నారు. నిత్యావసరాలైన బియ్యం, కందిపప్పు ఇతర పప్పుధాన్యాలు కూరగాయలు అన్నీ అందుబాటు ధరల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల సంఘ సభ్యులు మాట్లాడుతూ కాకినాడ నగరానికి సంబంధించి జనాభా పెరుగుతున్నందున మరికొన్ని రైతుబజార్లు అందుబాటులోకి తెచ్చేలా చర్య తీసుకోవాలని కోరారు. ఈవిషయమై తగు నివేదిక ఇవ్వాలిందిగా మార్కెటింగ్‌శాఖను జేసీ ఆదేశించారు. పాలప్యాకెట్లు, బ్రెడ్ ప్యాకెట్లు, ఇతర ఆహార పదార్థాలు ప్యాకింగ్ తప్పనిసరిగా తయారీ తేదీని, వినియోగ తేదీని విధిగా ముద్రించాలన్నారు. ఏ వస్తువు ముద్రించకుండా ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి సత్యనారాయణ, మేనేజర్ దేవులనాయక్, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రలజీ సలీం, మార్కెటింగ్ ఏడీ రాఘవేంద్రకుమార్,కమర్షియల్ టాక్స్ పద్మావతి పాల్గొన్నారు.

కూటమిలోనూ.. కదలికేది!



రాజమహేంద్రవరంలో మెడికల్ కళాశాల నిర్మాణం ఇలా...

» మెడికల్ విద్య..మిథ్య

» తూర్పున కళాశాల ఆరంభం

» వసతులు చూస్తే అరకొరే

» కోనసీమలో భవనాలే లేవు

» నేటికీ పునాది దాటని వైనం

» వైసీపీ నిర్వాకం..సాగని పనులు

» 10 నెలలైనా పట్టని కూటమి

నాడు అంతన్నారు.. ఇంతన్నారు.. పూర్తిచేయకుండా వదిలేశారు.. నాలుగేళ్లయ్యింది.. నేటికీ నిర్మాణంలోనే ఉన్నాయి.. ఇదీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలల తీరు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలో అయితే భవన నిర్మాణాలు పూర్తికాకుండానే తరగతులు ప్రారంభించేశారు.. సౌకర్యాలు చూస్తే అరకొరే.. విద్యార్థులకు ఇబ్బందే.. అయినా పట్టించుకునేవారే లేరు.. కన్నెత్తి చూసేవారు కానరావడంలేదు.. ఇక అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అయితే నేటికీ భవన నిర్మాణాలు పునాది దశనూ దాటలేదు.. కాకినాడ జిల్లా రంగరాయ మెడికల్ కళాశాలలోనూ నేటికీ సమస్యలు వెన్నాడుతు న్నాయి.. గత ప్రభుత్వంలో సరే సరి.. కూటమి ప్రభుత్వంలోనూ కదలికలేకపోవడంపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..

మెడికల్ కళాశాలల నిర్మాణ పనులు నత్తనడక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఆర్భాటాలకే కానీ.. వాస్తవ రూపంలో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించక పోవడం వల్ల మెడికల్ కాలేజీ, కొత్త ఆసుపత్రి నిర్మాణ పనులు నత్తనడకన సాగాయి. కూటమిలోనైనా వేగం పుంజుకున్నాయా అంటే అదీ లేదు. సమస్య ఏమిటో కానీ నాడు పనులు ఎలా ఉన్నాయో నేటికీ అలాగే ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నా కాంట్రాక్టర్లు వేగంగా పనిచేయడం లేదనే అక్కడిఅధికారులే చెప్పడం గమనార్హం. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలో రూ.475కోట్లతో మెడికల్ కాలేజీ, ఆసుపత్రి భవనాలు నిర్మించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ రూ.100 కోట్ల పని మాత్రమే జరిగింది. ఏడాదికి 150 మంది విద్యార్థులతో నడుస్తున్న ఈ కాలేజీలో ప్రస్తుతం రెండో బ్యాచ్ నడుస్తోం ది. సెప్టెంబర్‌కు మూడో బ్యాచ్ వస్తుంది.ప్రతిఏడాది 150సీట్లలో 110నుంచి 120వరకూ అమ్మాయిలే చేరడం గమనార్హం. వారు ఇంత వరకూ హాస్టల్ సౌకర్యం లేక ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం బాలికలు 360మందికి, బాలురు 120మందికి సరిపడా హాస్టల్ కట్టారు. కానీ ఇవి ఇంకా పూర్తిగా అందుబాటులోకి లేదు. కాలేజీ భవనం పూర్తి కాలేదు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు క్లాసులు పీఈడీ(నర్సింగ్ విద్యార్థులకు నిర్మించిన) భవనంలో జరుగుతున్నాయి. మూడో బ్యాచ్ సెప్టెంబరులో రానుంది. అప్పటికి కొత్త కాలేజీ భవనం నిర్మాణం కాకపోతే ఇబ్బందే.కొత్త కాలేజీ భవనంలో 17 శ్లాబ్‌లకు 15 పూర్తి చేశారు.ఇంకా రెండు పూర్తి చేయాలి. ఇక్కడ మెడికల్ కళాశాలకు అనుబంధంగా 500 పడకల కొత్త బోధనాస్పత్రి నిర్మించాలి. ఇప్పటికే పేషెంట్ల సంఖ్య పెరిగిందని, పుష్కరాల నాటికి బాగా పెరుగుతుందని, అప్పటికి కొత్త ఆస్పత్రి అందుబాటులోకి రావాలని ఇటీవల ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభుత్వానికి లేఖ రాశారు.

కోనసీమలో ఆగిన పనులు..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

నాలుగేళ్లు కావొస్తున్నా ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు పునాదుల దశలను దాటలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాల నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణలోనే పునాదుల్లో ఉన్న భవనాలు, నిర్మాణ సామగ్రి ఉన్నాయి. వందల కోట్లతో చేపట్టిన వైద్య కళాశాల భవనాల్లో కొన్ని శ్లాబ్‌ల దశలకు చేరుకున్నాయి. ప్రధాన వైద్య కళాశాల భవనం పునాదుల స్థాయికి మాత్రమే పరిమితమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణానికి కూతవేటు దూరం సమనస గ్రామంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 మే 31న అప్పటి సీఎం వైఎస్ జగన్ వర్చువల్ విధానంలో ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాటి నుంచి వైద్య కళాశాల నిర్మాణ పనుల ప్రగతి 'మిథ్య'గా మారింది. 56 ఎకరాల్లో రూ.475 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 32 భవనాలు నిర్మించాల్సి ఉన్నా ప్రస్తుతం 17 భవనాలు వివిధ దశల్లో మాత్రమే నిర్మించడానికి కాంట్రాక్టు సంస్థ అయిన మెగా ఇంజనీరింగ్ చర్యలు చేపట్టింది. ప్రధానమైన 750 పడకల ఆస్పత్రి కీలక భవనంతో పాటు ఆరు బ్లాకులతో వైద్య కళాశాల భవనాలు శ్లాబ్‌ల దశకు చేరుకున్నాయి. మిగిలిన బాయ్స్, లేడీస్ హాస్టల్స్ భవనాలు కొన్ని శ్లాబ్‌లు పూర్తయ్యాయి. వివిధ రకాల ల్యాబ్‌లు నిర్మాణ పనులు పునాదుల దశలోనే నిలిచిపోయాయి. ఈ వైద్య కళాశాల నిర్మాణ పనులు వచ్చే నెల ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని నాడు వైసీపీ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కాంట్రాక్టు సంస్థకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే పనులు నత్తనడకన జరగానికి కారణమని సమాచారం. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు కావొస్తున్నా వైద్య కళాశాల నిర్మాణ ప్రగతిపై ప్రభుత్వం ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ప్రస్తుతం కళాశాల నిర్మాణ పనుల్లో కీలక పాత్ర వహించిన మెగా సంస్థ స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యాలయాలు, ఇతర సామగ్రిని ఖాళీ చేసి వెళ్లిపోయినట్టు సమాచారం. మరి ఈ కళాశాల భవనాల నిర్మాణాలు మళ్లీ పునః ప్రారంభమయ్యేది ఎప్పుడో వేచి చూడాల్సిందే.



కాకినాడ రంగరాయలోనూ ఇంతేగా!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోనే అత్యంత ప్రఖ్యాతి చెందిన రంగరాయ మెడికల్ కాలేజీనీ అనేక సమస్యలు వెన్నాడుతున్నాయి.సమర్థవంతమైన వైద్యులను తయారు చేయడంతో పేరొందిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ అనేక వసతుల లేమితో కొట్టుమిట్టాడుతోంది. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా అనేక పనులకు టెండర్లు పిలిచి ఆనక నిధులివ్వకపోవడంతో ఇపుడవన్నీ వెక్కిరిస్తున్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ఎదురుచూస్తున్నాయి.ప్రధానంగా మెడికల్ కాలేజీ విద్యార్థులకు సంబంధించి ఏడాదిగా వసతి గృహాల బ్లాకులు కదలకుండా ఆగిపోయాయి.దాదాపు రూ.70 కోట్లతో ప్రారంభించిన రెండు యూజీ, పీజీ వైద్యుల హాస్టల్ బ్లాకుల నిర్మాణం ప్రారంభమైనా నిధుల్లేక పనులకు గ్రహణం పట్టింది. వందల్లో ఉన్న వైద్యవిద్యార్థులకు జీప్లస్5, జీప్లస్ 4 విధానంలో రెండు బ్లాకుల నిర్మాణం గతేడాది ప్రారంభం కాగా ప్రస్తుతం జీప్లస్5 బ్లాక్ మొదటి అంతస్తు నిర్మాణ దశలోనే ఉంది. జీప్లస్4 బ్లాక్ అయితే ఇంకా పునాదుల స్థాయి దాటలేదు.వైద్య విద్యార్థినులకు సంబంధించి యూజీ, పీజీ వైద్యుల కోసం రూ.100 కోట్లతో జీప్లస్ 5, జీప్లస్ 8 కింద రెండు బ్లాకుల నిర్మాణం ప్రారంభించారు.గతేడాది నుంచీ పనుల్లో కదలికలేదు. నిధులేకపోవడంతో కాంట్రాక్టర్ అడ్రస్ లేదు. జీజీహెచ్‌కు ఇన్‌పేషెంట్ రోగుల తాకిడి అధికంగా ఉండ డంతో కొన్నాళ్ల కిందట సూపర్‌స్పెషాలిటీ బ్లాకులను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు.జీజీహెచ్‌కు అనుబంధంగా నర్సింగ్ కాలేజీ, హాస్టల్ నిర్మించాలని భావించి సమీపంలో ఆరెకరాల ప్రభుత్వ భూమి కేటాయించినా పనులు జరగకుండా నిలిచిపోయాయి.



రౌతులపూడి మండలం మూలపూడి పరిధిలో సర్వేనెంబర్ 1లో అనుమతిలేని క్వారీ

బండరాళ్లకు గిరాకీ

» అనుమతులు లేని క్వారీల్లో బండరాళ్ల తవ్వకాలు

» పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు

రౌతులపూడి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలం మూలపూడి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్-1లో అనుమతులు లేని మూడు క్వారీల నుంచి బోలర్(బండరాళ్లను) తరలిస్తున్నారు. బండరాళ్లకు గిరాకీ పెరిగింది. దీంతో ఈ ప్రాంతంలో అనుమతిలేని క్వారీలపై ఓ ప్రజాప్రతినిధి బంధువు కళ్లుపడ్డాయి. ఇంకేముంది దర్జాగా అనుమతి లేని క్వారీల నుంచి యథేచ్ఛగా బండరాళ్లను తరలిస్తున్నారు. విశాఖ జిల్లా రాంబల్లి దగ్గర నావీ నిర్మిస్తున్న టర్మినల్‌కు ఈ బండరాళ్లను తరలిస్తున్నారు. పగలంతా క్వారీలో బ్లాస్టింగ్ చేసి 20 లారీల్లో బండరాళ్లను లోడ్‌చేసుకుని మల్లంపేట సమీపంలో ఓ క్రషర్ సమీపంలో లారీలను ఉంచుతున్నారు. రాత్రి 10గంటలు దాటిన తర్వాత లారీల్లో బండరాళ్లను తరలిస్తున్నారు. ఈ లారీలకు బిల్లును ఏలేశ్వరంలో అనుమతి పొంది క్వారీలను తీసుకువస్తున్నట్టు సమాచారం. అనుమతి లేని క్వారీలకు బ్లాస్టింగ్ మెటీరియల్ సరఫరా చేయకూడదు. అనుమతి పొందిన క్వారీల కంటే ఎక్కువ సొమ్ములు చెల్లించడంతో బ్లాస్టింగ్ మెటీరియల్ ఇస్తున్నారు. ఇందతా తెలిసిన మైనింగ్, రెవెన్యూ అధికారులు ఏమీపట్టించుకోకపోవడంపై భారీస్థాయిలోనే మామూళ్లు అందుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్క మూలగపూడి పరిధిలోనే కాకుండా మండలంలోని క్వారీల్లో కొన్ని అనుమతి పొందగా, మరికొన్ని అనుమతి లేకుండా బండరాళ్లను తరలిస్తున్నట్టు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అనుమతిలేని క్వారీల్లో అక్రమ బండరాళ్ల తరలింపు, బ్లాస్టింగ్ మెటీరియల్ సరఫరా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బండరాళ్లను తరలిస్తున్న లారీలు



కోటివారి అగ్రహారంలో సినిమా షూటింగ్ సందడి

అంబాజీపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండలం మాచవరం పరిధి కోటి వారి అగ్రహారం మేడిది సత్తిరాజు వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం బంగారు మురుగు సినిమా షూటింగ్ జరిగింది. ముత్యాలపల్లికి బ్యానర్‌పై ప్రఖ్యాత చిత్రకారుడు కూచి, ఆర్ట్ డైరెక్టర్ బ్రహ్మం పర్యవేక్షణలో రమణ రచయితగా, డొక్కా ఫణి దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఇందులో తనికెళ్ల భరణి, ఐడ్రీమ్ అంజలి, ప్రదీప్, సరస్వతి, జెన్ని, రత్నసాగర్ నటిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఫణీంద్ర గొల్లపల్లి తెలిపారు. 1969 నుంచి 1980 వరకు బామ్మ, మనవడి మధ్య జరిగే సన్నివేశాలను ఈ చిత్రంలో తెరకెక్కిస్తున్నారు. బామ్మ పాత్రలో రత్నసాగర్ ముఖ్య పాత్ర పోషిస్తోందన్నారు. హీరో, హీరోయిన్‌గా కొత్తవారిని పరిచయం చేస్తున్నట్టు చెప్పారు. పార్థు నిమాని మ్యూజిక్ డైరెక్టర్‌గా, ప్రముఖ గాయకురాలు చిత్ర రెండు పాటలు పాడారన్నారు. రెండువారాల కోనసీమ ప్రాంతంలో షూటింగ్ ఉంటుందన్నారు.


ఓ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

మంచి కథతోనే నటుడికి గుర్తింపు

● ప్రముఖ హాస్యనటుడు జెన్నీ



నాటకం, సినిమాలోని మంచి కథతోనే నటుడికి తగిన గుర్తింపు వస్తుందని ప్రముఖ హాస్యనటుడు జెన్నీ అన్నారు. షూటింగ్‌లో భాగంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. మాది కోనసీమ జిల్లాలోని ఆలమూరు. హైదరాబాద్‌లోని ఈసీఎల్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేశా. నాటకాలపై ఉన్న మక్కువతో సినిమారంగంలోకి వచ్చా. 1986లో జంధ్యాల సినిమాలో తొలి అవకాశం లభించింది. ఇప్పటివరకు 400 సీరియల్స్, 300 సినిమాల్లో నటించాను. ఎండమావులు, లేడీడిటెక్టర్, అంతరంగాలు సీరియల్స్ మంచి గుర్తింపు తెచ్చాయి. దాదాపు 80 కథలు రాయగా, అందులో 30 కథలకు ప్రత్యేక బహుమతులు అందుకున్నా.

1960లో సినిమా ఇండస్ట్రీకి వచ్చా

● సీనియర్ నటి రత్నసాగర్



1960లో సినీ ఇండ్రస్ట్రీకి వచ్చా. ఇప్పటి వరకు 250 సినిమాలు, మూడవేలకు పైగా సీరియల్స్ లో నటించా. కారాలు - మిరియాలు సినిమాకు నంది అవార్డు లభించింది. ముగ్గురు మొనగాళ్లు, లక్ష్మీనరసింహ, ముద్దుల ప్రియుడు చిత్రాలు మంచి గుర్తింపును తెచ్చాయి. కోనసీమ అందాలు మరువలేను, ఈ ప్రాంత వాసులు చూపే ఆప్యాయత, అనుబంధాలు మరిచిపోలేనివి.

చల్లంగ చూడమ్మా..!

● 28 నుంచి చింతలూరు నూకాంబిక జాతర ప్రారంభం
● ఆలయం వద్ద కట్టుదిట్టమైన భద్రత
● ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు
● లక్షలాదిగా తరలిరానున్న ఉభయ గోదావరి జిల్లాల భక్తులు

ఆలమూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గోదావరి జిల్లాల్లో పేరుగాంచిన ప్రధాన జాతరలో ఆలమూరు మండలం చింతలూరు నూకాంబిక జాతర ఒకటి. ఈనెల 28 నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో 28న జాతర మహోత్సవం, 29న తీర్థం, 30న ఉగాది ఉత్సవాలతోపాటు మొత్తం నెలరోజుల పాటు జాతర జరగనుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా కట్టుదట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి తెలిపారు. దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లను సేవాకమిటీలు ఇప్పటికే ఏర్పాటు చేశాయి. లక్షలాది మంది తరలిరానున్న ఈ జాతరను సమర్థవంతంగా నిర్వహించాలని పలుశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమీక్షలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ సూచించారు. చంటిపిల్లల దేవతగా కొలిచే అమ్మవారికి జాతర ఉత్సవాలలో పలువురు దర్శించుకుని మొక్కుబడులు, చెల్లించుకుని వారపోత, తుళ్లిబిళ్ల, కావిడి కోళ్లు, గండాదీపం ఇక్కడ ప్రధానంగా మొక్కులు తీర్చుకుంటారు.సాధారణంగా చంటిపిల్లల్లో వచ్చే ఆటలమ్మ, పొంగు వంటి వ్యాధులు అమ్మవారి ఆగ్రహం వల్ల వస్తాయని, అందువల్ల ఈవ్యాధి సోకిన చంటిపిల్లలచేత ఈ మొక్కులు తీరుస్తుంటారు. అలాగే ఈ వ్యాధులు రానివారు అమ్మవారి అనుగ్రహం ఉందని మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. దీంతో పూర్వపు ఉభయగోదావరి జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు చింతలూరు తరలి వస్తుంటారు. జాతరకు వచ్చే భక్తుల కోసం రావులపాలెం, అమలాపురం, రాజమహేంద్రవరం, రామచంద్రాపురం డిపోల నుంచి ఇక్కడికి ప్రత్యేక బస్సులను నడుపుతారు. జాతర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ ఎం.అశోక్ చెప్పారు. జాతర సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని స్థానికులు దీనికి సహకరించాలని వారు కోరారు.


చింతలూరు నూకాంబిక అమ్మవారు



పునర్నిర్మాణం తరువాత ఆలయం, జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే పూలగరగ

మలబార్ ట్రస్టు దాతృత్వం

● ఇంటర్ విద్యార్థినులకు రూ.24 లక్షల స్కాలర్‌షిప్‌ల అందజేత


స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు, మలబార్ సంస్థ డైరెక్టర్ హిషాం మహమ్మద్ ఆలీ, తదితరులు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మలబార్ ట్రస్టు ద్వారా ఇంటర్మీడియేట్ బాలికలకు రూ. 24 లక్షల స్కాలర్‌షిప్‌ల అందజేశారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ప్రముఖ వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూం, మలబార్ నేషనల్ స్కాలర్‌షిప్ ప్రోగ్రాం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగం గా మంగళవారం స్థానిక శ్రీ త్యాగరాజ నారాయణదాస సేవా సమితి ప్రాంగణంలో ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 246 మంది బాలికలకు రూ. 24 లక్షల స్కాలర్‌షిప్‌లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మలబార్ సంస్థ సామాజిక సేవా తత్పరతను కొనియాడారు. సంస్థ డైరెక్టర్ హిషాం మొహమ్మద్ ఆలీ మాట్లాడుతూ మలబార్ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా మహిళా సాధికారత కోసం ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా 95 వేల మందికి పైబడి రూ. 60 కోట్ల స్కాలర్‌షిప్‌లను అందజేసిందన్నారు. బాలికల విద్యపై దృష్టి సారించడం ద్వారా, సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, భావితరాల సామాజిక, ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్నామన్నారు. అసి స్టెంట్ మార్కెటింట్ మేనేజర్ అయ్యప్పస్వామి, సేల్స్ టీం నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎంపికైన బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'కోకో'కు గిట్టుబాటు ధర కల్పించాల్సిందే

● కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన
● ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేత



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కోకో రైతులు

కొవ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద గల కోకో గింజలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి, కొనుగోలు చేయాలని కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కోకో రైతులు ఆందోళన చేశారు. అనంతరం ఆర్డీవో డా. రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ గత నెలరోజులుగా కోకో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నప్పటికీ.. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీలు సిండికేట్‌గా మారి ధర తగ్గించి రైతులను నిలువునా మోసగిస్తున్నాయన్నారు. అన్ సీజన్ సాకుతో గింజలను కొనుగోలు చేయకపోవడంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకోకు ధర ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికీ నష్టపోయిన రైతులకు ఇక ఆత్మహత్యలే శరణ్యమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతులు మరింత నష్టపోతారన్నారు. గత నెలలో కిలో గింజలు రూ. 650 ఉంటే ప్రస్తుతం రూ. 500లకు తగ్గించి రైతులను ఇబ్బందులకు గురిచేశారని, అన్ సీజన్ పేరుతో రూ. 200 నుంచి రూ. 240లకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారన్నారు. కోకో గింజలతో పచ్చళ్లు పెట్టుకోండి అంటూ రైతులను హేళన చేస్తున్నారన్నారు. కోకో గింజలకు రూ. 900 మద్దతు ధర కల్పించకపోతే రైతులు నష్టపోతారన్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి రైతుల నుంచి కోకో గింజలను కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకాన్ని అమలు చేయాలన్నారు. విదేశీ కోకో గింజల దిగుమతిని నిలుపుదల చేయాలన్నారు. ఉద్యానశాఖ నుంచి రావాల్సిన సబ్సిడీ బకాయిలను వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఉప్పల కాశీ, నాయుడు లక్ష్మణరావు, ఉండవల్లి కృష్ణారావు, గారపాటి వెంకట సుబ్బారావు, కంకటాల బుద్ధుడు, సుభాష్ చంద్రబోస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర బాబు, ఆలపాటి శ్రీధర్, సంగీత నాగరాజు, ఆకుల మోహనరావు, బిక్కిన కృష్ణ, జీ. శ్రీమన్నారాయణ, ఎంవీవీ సత్యనారాయణ, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● శ్రమదానంలో నన్నయ వీసీ ప్రసన్నశ్రీ


శ్రమదానం చేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 27(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన శ్రమదానం కార్యక్రమంలో వీసీ పాల్గొని విద్యార్థులతో కలిసి ఇటుకలు మోశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ మన ప్రాంగణం అనే భావనతో ముందుకు సాగాలన్నారు. వర్సిటీ విద్య కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో నన్నయ ప్రాంగణంలోని బ్యాంకు పక్కన వాహనాల పార్కింగ్‌కు ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచే కార్యక్రమం విద్యార్థులు చేపట్టారు. వీసీ విద్యార్థులతో కలిసి కొద్దిసేపు సిమ్మెంట్ ఇటుకలు మోశారు. వీసీ స్వయంగా శ్రమదానం చేస్తుండడంతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, యూనియన్ బ్యాంకు మేనేజర్ కూడా శ్రమదానంలో పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 2024 జనవరి 21వ తేదీన కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పారామెడికల్ పోస్ట్‌లకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఆ నోటిఫికేషన్‌కు సంబంధించిన రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్‌లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు చెందిన అభ్యర్థులు తమ జిల్లాలకు సంబంధించిన ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో తమపేర్లను పరిశీలించుకోవాలని కోరారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే ఈనెల 27, 28 తేదీల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో లిఖిత పూర్వకంగా తమ అభ్యంతరాలు సమర్పించాలన్నారు. ఈనెల 28 వ తేదీ సాయంత్రం 4 గంటల తరువాత వచ్చిన ఎటువంటి అభ్యంతరాలకు సంబంధించిన దరఖాస్తులను పరిగణించబోమని స్పష్టం చేశారు.

కొమ్మ..కొమ్మకు.. గుత్తులు..గుత్తులు

● చెట్టు మొదళ్లనే విరగకాసిన మామిడికాయలు

సామర్లకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మామిడికాయలు అంటే చిటారు కొమ్మలకు కాస్తాయి అనేది అందరికీ తెలిసిందే. సామర్లకోట ఏడీబీ రోడ్డులో ఒక పొలంలో మామిడిచెట్టు లావుగా ఉన్న మొదలు కొమ్మలకు ఎటువంటి ఆకులు లేకుండా గుత్తులు గుత్తులుగా మామిడికాయలు కాసి ఆ దారిన పోతున్న పలువురిని ఆకర్షిస్తున్నాయి. బంగినపల్లి రకానికి చెందిన ఈ మామిడికాయలు ఏడాది విడిచి ఏడాది ఈ రీతిలో చెట్టు మొదలు కొమ్మలకు గుత్తులు గుత్తులుగా కాయలు కాస్తాయని రైతు వెంకన్నకాపు చెప్పారు.



సామర్లకోటలో మామిడి చెట్టు మొదళ్లకే కాసిన మామిడికాయలు



అమ్మా నేను మోసపోయా..

● ఫార్మ్‌డీ ఫైనలియర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
● రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేనిలో ఘటన
● ఆసుపత్రి కోఆర్డినేటర్ దీపక్ వేధింపులే కారణమని ఆరోపణ


విద్యార్థి అంజలి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అమ్మా నా గురించి బెంగపెట్టుకో వద్దు.. నేను దారుణం గా మోసపోయా..ఒక ఫంక్షన్‌కి రెడ్ కలర్ శారీ కట్టుకుని వెళ్లి వాడికళ్లలో పడ్డా..ఆ ఫంక్షన్‌కి రెడ్ కలర్ శారీ కట్టుకుని వెళ్లకుండా ఉండాల్సింది. అలా చేసి ఉంటే ఈ రోజు సంతోషంగా ఉండేదానిని.. వాడు తనను మోసం చేశాడని.. తనకు మరణం తప్పవేరే దారి కనిపించడం లేదు.. నా కోసం ఆలోచించవద్దు..చెల్లికి మంచి వ్యక్తిని చూసి పెళ్లి చేయండి.. తాను మరణించాక తన అవయవాలను దానం చేయాలని.. తన చెల్లికి తాను మళ్లీ పాపగా పుడతానని ఒక వైద్య విద్యార్థిని డైరీలో రాసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వికాస్ ఫార్మసీ కళాశాల పార్మ్‌డి ఫైనలియర్ విద్యార్థిని నల్లపు అంజలి (23) ఆత్మహత్యాయత్నం తీవ్రసంచలనం కలిగించింది. తోటి విద్యార్థినులను కదిలిచింది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మం డలం రౌతుగూడెం గ్రామానికి చెందిన అంజలి రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి వద్ద వికాస్ ఫార్మసీ కళాశాలలో ఫార్మ్ డి ఫైనలియర్ చదువుతుంది. గత ఆరునెలలుగా రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తుంది. ఇదిలా ఉండగా ఈ నెల 23న ఆసుపత్రిలో అంజలి ఎనస్థీషియా అత్యధిక డోస్ ఇంజక్షన్ చేసుకుని కొద్దిసేపటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. ఆమెతో కలిసి పనిచేసే సహచర సిబ్బంది గమనించి వెంటనే ఐసీయూలోకి తరలించి వైద్యం అందించారు. అయితే పరిస్థితి విషమించినా విషయం బయటకు రాకుండా ఆసుపత్రి వర్గాలు జాగ్రత్తపడ్డాయి. అయితే ఆమె డైరీలో రాసుకున్న సూసైడ్ లెటర్ బయటకు రావడంతో అంజలి తల్లిదండ్రులు, బంధువుల, కళాశాల విద్యార్థినులు, విద్యార్థి సంఘాలు మంగళవారం రాజమహేంద్రవరంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. బొల్లినేని ఆసుపత్రిని ముట్టడించి ధర్నా చేశాయి. అంజలి ఆత్మహత్యాయత్నానికి కారణమైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో మెడికల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తు న్న దీపక్ ఆమెను వేధించి అవసరాలు తీర్చుకుని ఇదే విషయాన్ని మరికొంత మందికి చెప్పి వేధింపులకు గురిచేయ డంతో తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె రాసిన లేఖలో కూడా తాను అనుభవించిన దారుణ సంఘటనలు వివరించింది. సంఘటన స్థలాన్ని ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీలు రమేష్ బాబు, భవ్యకిషోర్ పర్యవేక్షించారు. అంజలి తండ్రి నల్లపు దుర్గారావు ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించం

● ఎమ్మెల్యేలు బత్తుల, ఆదిరెడ్డి

విషయం తెలుసుకున్న రాజానగరం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు ఆసుపత్రికి చేరుకుని అంజలి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరాతీశారు.ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పడంతో మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం అంజలి తల్లి,చెల్లిని పరామర్శించారు.ఈ ఘటనకు కారణమైన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని.. ఆడబిడ్డకు అన్యాయం జరిగితే సహించేదిలేదన్నారు.అంజలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తొలుత ఆందోళన చేస్తున్న విద్యార్థినులకు మాజీ ఎంపీ భరత్‌రామ్ మద్దతుగా నిలిచారు.


కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జీ.మేడపాడు ఎత్తిపోతల పథకం అక్రమాలపై విచారణ

● రైతుల నుంచి వాంగ్మూలాలు సేకరణ


సామర్లకోటలో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

సామర్లకోట, మార్చి25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం జీ.మేడపాడు ఎత్తిపోతల పథకంలో పలు అక్రమాలు చోటుచేసుకుని రైతులనుంచి సేకరించిన సొమ్ములు స్వాహాకు గురవుతున్నాయని, సంస్థ అధ్యక్షుడు ఎత్తిపోతల పథకాన్ని తన సొంత ఆస్తిలా వాడుకుంటున్నాడని ఆయకట్టు రైతులు జిల్లా అధికారులకు చేసిన ఫిర్యాదుతో మంగళవారం సామర్లకోట తహశీల్దార్ కార్యా లయంలో సమగ్రవిచారణ నిర్వహించారు. తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, కోపరేటివ్ రిజిస్ట్రార్ శివకామేశ్వరరావు ఈ విచారణలో పాల్గొన్నారు. ఫిర్యాదుదారుల తరఫున తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పాలకుర్తి వీరభవన్నారాయణ, ఎత్తిపోతల పథకం డైరెక్టర్లు పాలకుర్తి చినబాబు, మద్దిపాటి ప్రకాష్, గోలి తమ్మిరాజు, పుట్టా రాంబాబు, తదితర రైతులు పాల్గొని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి ముందు తాము ఎదుర్కొంటున్న సమస్యలు అక్రమాలపై ఎలుగెత్తారు. ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు కాకుండా అనధికార ఆయకట్టుకు రెండు పంటలకూ సాగునీరు సమృద్ధిగా అందిస్తూ ఏటా లక్షలాది రూపాయలు అక్రమ వసూళ్లు చేస్తున్నారన్నారు. వాస్తవ ఆయకట్టులో ఇద్దరి రైతులకు చెందిన సుమారు 90 ఎకరాలు ఆయకట్టు ఉండగా వాటికి అసలు నీరివ్వకుండా అక్రమంగా మరో 100 ఎకరాలకు సాగునీరందిస్తున్నట్లు రికార్డులలో టాంపరింగ్ చర్యలకు పాల్పడుతున్నారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రెజర్‌వాల్వ్ ఓపెన్‌చేస్తూ నీటిని అక్రమంగా మళ్లిస్తూ వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. నీటి యాజమాన్యం, నిధుల స్వాహా, ఆయకట్టు కమిటీ ఎన్నికలు నిర్వహించకపోవడం వంటి అంశాలతో సొంత ప్రైవేట్ కంపెనీగా అక్రమంగా వాడుకుంటూ ఏటా లక్షలాది రూపాయలు స్వాహా చేస్తున్నాడని పలువురు ఫిర్యాదుదారులు తహశీల్దార్, కోపరేటివ్ రిజిస్ట్రార్ ఎదుట వివరించారు. ఎత్తిపోతల పథకం నిర్వహణలో ఐడీసీ అధికారులు, కోపరేటివ్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉన్నప్పటికీ ఆ రెండు శాఖల అధికారులు మౌనం దాల్చడంతో కమిటీ అధ్యక్షుడు అక్రమాలకు పాల్పడేందుకు దోహదపడిందని శ్రీనుబాబు అధికారుల ఎదుట ఆరోపించారు. ఈ విచారణలో ఎత్తిపోతల పథక ఆయకట్టుదారుల సంఘ అధ్యక్షుడు ఆచంట రాజబాబు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారి అధ్యయనోత్సవాలు

● గరుడవాహనంపై విహరించిన శ్రీవారు

ఆత్రేయపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి అధ్యయనోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే గోదావరి నదీజల సంగ్రహణ కార్యక్రమం మేళతాళ మంగళవాయిద్యాల నడుమ నిర్వహించారు. స్నపనమూర్తులకు అభిషేకం నిర్వహించారు. అనంతరం ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనాలు అందించారు. అధ్యయనోత్సవాలలో భాగంగా పల్లకి మహోత్సవం, శ్రీవారు గరుడవాహనంపై ఆశీనులై వీధుల్లో విహరించారు. మేళతాళ మంగళ వాయిద్యాలు వేదమంత్రాలు, కేరళవాయిద్యాలతో అధ్యయనోత్సవాలు శోభయమానంగా నిర్వహించారు.స్వామివారి కల్యాణోత్సవాలకు ముందుగా ఈఉత్సవాలను నిర్వహిస్తారు. ఐదు రోజులపాటు అధ్యయనోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఆలయ ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు చేశారు.


శ్రీ వేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలలో భాగంగా గరుడవాహన గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


వాడపల్లి అధ్యయనోత్సవాలలో భాగంగా ద్రవిడ వేదపారాయణం నిర్వహిస్తున్న వేదపండితులు

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆదాయం రూ.26,48,813



ఆలయంలో హుండీలను లెక్కిస్తున్న అధికారులు, భక్తులు, సిబ్బంది

అంతర్వేది, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో మంగళవారం తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీలను లెక్కించినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.25,86,985, గుర్రాలక్కమ్మ హుండీ రూ.20, 676, అన్నదాన హుండీ రూ.41,152 మొత్తం హుండీల ద్వారా 39 రోజులకుగాను రూ.26,48,813 ఆదాయం వచ్చినట్టు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఒడుగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధిలో భక్తులకు ఏసీ గదుల నిలుపుదల

ఉన్నతాధికారులు వివరణ కోరడంతో పునరుద్ధరణ

అన్నవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో నీటి కొరత కారణంగా ఈవో సుబ్బారావు ఆదేశాలతో భక్తులకు ఏసీ గదులను సోమవారం రాత్రి నుంచి సీఆర్వో కార్యాలయంలో కేటాయింపును నిలుపుదల చేశారు. మంగళవారం ఉదయం దీనిపై ఉన్నతాధికారులు వివరణ కోరడంతో గదుల కేటాయింపు పునరుద్ధరించారు. పంపా రిజర్వాయర్‌లో అడుగింటిపోయిన భూగర్భనిల్వలు నేపథ్యంలో సత్యగిరి కొండపైకి నీటి సరఫరా సరిగా జరగడం లేదు. సత్యగిరి కొండపై శివసదన్ కాటేజీలో 138, హరిహరసదన్ కాటేజీలో సుమారు 80 గదులు ఉన్నాయి. రత్నగిరి కొండపై ప్రకాష్‌సదన్ కాటేజీలో 84 ఏసీ గదులుండగా వేసవి నేపథ్యంలో భక్తులు ఏసీ గదులు తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఒక్కసారిగా ఏసీ గదుల కేటాయింపు నిలుపుదల నేపథ్యంలో భక్తుల నుంచి విమర్శలు రావడం, వివిధ ప్రసార మాధ్యమాల్లో దావానంలా వ్యాపించడంతో కాకినాడ జిల్లా కలెక్టర్, దేవదాయశాఖ కమిషనర్ వివరణ కోరడంతో గదుల కేటాయింపు పునరుద్ధరించారు.

లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్ఐ, డ్రైవర్‌కు 14రోజుల రిమాండ్

పిఠాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కాకినాడ జిల్లా పిఠాపురం రూరల్ ఎస్ఐ ఎల్.గుణశేఖర్, ప్రవేటు డ్రైవర్ నల్లా శివలకు 14రోజులు పాటు రిమాండ్ విధిస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పిఠాపురం మండలం పి.దొంతమూరు గ్రామానికి చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజులను 2024 అక్టోబరులో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు నుంచి తప్పించేందుకు ఎస్ఐ రూ.20వేలు లంచం డిమాండ్ చేశారు. ఈ లంచం తీసుకుంటుండగా రూరల్ ఎస్ఐ గుణశేఖర్‌తో పాటు అతను వినియోగించే పోలీసు జీపు ప్రవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్న నల్లా శివను ఏసీబీ డీఎస్పీ కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి దాడి చేసి పట్టుకున్న సంగతి తెలిసిందే. వారిని రాజమహేంద్రవరం ఏసీబీ కార్యాలయంలో మంగళవారం విచారించారు. రాత్రి ఏసీబీ కోర్టులో హాజరుపరచగా ఏప్రిల్ 18వ తేదీ వరకూ జడ్జి రిమాండ్ విధించారు. అరెస్టు అనంతరం ఎస్ఐ వద్ద ఉన్న మొబైల్స్‌తో పాటు ప్రవేటు డ్రైవర్ వద్ద ఫోన్లను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో కేసులకు సంబంధించిన కొన్ని రికార్డులు తమతో తీసుకెళ్లినట్టు సమాచారం.

లావాదేవీలపై ఆరా...

పిఠాపురం రూరల్ ఎస్ఐ, ప్రవేటు డ్రైవర్ల సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు అందులో ఫోన్‌కాల్స్, వాట్సాప్ మెసేజీలు, ఫోన్‌పే, జీ పే లావాదేవీలపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఎస్ ఐ నుంచి ఫోన్‌పే ద్వారా ఒక పోలీసు ఉన్నతాధికారి వద్ద పనిచేస్తూ ఎస్సీఎస్టీ కేసులు చూసే సిబ్బంది ఒకరికి పంపిన నగదు విషయాన్ని గుర్తించి దానిపై ఆరా తీస్తున్నట్టు పోలీసు వర్గా లు తెలిపాయి. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఏసీబీ అధికారులు విచారణ జరుపుతున్నట్టు చెబుతున్నారు. ఎస్ఐ ఏసీబీకి చిక్కడంతో కాకినాడ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులందరూ అలర్టయ్యారు. ప్రవేటు వ్యక్తులను పోలీసుస్టేషన్లకు రావద్దని చెప్పడం గమనార్హం.

కంటైనర్‌లో మందు సీసాల పట్టివేత

కంటైనర్ సీజ్, డ్రైవర్ అరెస్ట్

ముమ్మిడివరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బుకింగ్ సరుకు రవాణా చేస్తున్న కంటైనర్‌లో యానాం నాన్‌డ్యూటీపెయిడ్ మందు సీసాలను రవాణా చేస్తుండగా ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డారు. హైదరాబాద్‌కు చెందిన అమెజాన్ సంస్థకు చెందిన ఆన్‌లైన్‌లో బుక్ చేసిన సరుకును కంటైనర్‌లో తీసుకువెళ్తూ కాకినాడలో కొంత సరుకును దింపి అమలాపురం తరలించే క్రమంలో ఆ కంటైనర్ డ్రైవర్ నల్గొండకు చెందిన కొండ్రు వేణు యానాంలో ఆరు బీరు బాటి టిన్నులు, రెండు లీటర్ల విస్కీ బాటిళ్లను కొనుగోలు చేసి వస్తున్నాడు. ఎదుర్లంక చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడ్డాడు. కంటైనర్‌ను, డ్రైవర్‌ను కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు ముమ్మిడివరం ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ వారిస్తున్నా వినకుండా కంటైనర్ డ్రైవర్ వేణు అమలాపురం వైపు పోనిచ్చాడు. దారిలో 2 లీటర్ల విస్కీ బాటిళ్లను ధ్వంసం చేశాడు. దీంతో ఎక్సైజ్ సిబ్బంది చేజ్ చేసి కంటైనర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌కు తరలించారు. కంటైనర్‌ను సీజ్ చేసి కంటైనర్ డ్రైవర్ వేణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అదనపు కట్నం కోసం వేధింపులు భర్తతో సహా పలువురిపై కేసు

గొల్లప్రోలు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మహిళను అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తతో సహా పలువురిపై గొల్లప్రోలు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీకి చెందిన కోలా సునీతకు నాలుగు సంవత్సరాల క్రితం పిఠాపురం మండలం నవఖండ్రవాడకు చెందిన ఆనంద ప్రసాద్‌తో వివాహమైంది. వారికి ఒక పాప ఉంది. పెళ్లి సమయంలో రూ.4.50లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చినా కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త ఆనందప్రసాద్ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్టు సునీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. అతడికి తల్లి, ఆడపడుచు, ఆమె భర్త, అతడి మేనమామ, భార్యలు ఆనందప్రసాద్‌కు మద్దతు ఇచ్చి వేధింపులకు గురిచేస్తున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై వరకట్నం వేధింపులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

జాబ్‌మేళాలో 131మంది ఎంపిక

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో వికాస ఆధ్వర్యంలో 2రోజులపాటు జరిగిన జాబ్‌మేళాలో 131 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గూగుల్ అనుబంధ సంస్థ వర్చుసా కన్సల్టింగ్ సర్వీస్ కంపెనీలో వారు కంటెంట్ ఎనాలిస్టులుగా పనిచేస్తారు. మొత్తం 1440 అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నారు. మొత్తం 350 మంది అభ్యర్థులను ఎంపిక చేయాలని వర్చుసా ప్రతినిధులు ప్రకటించినప్పటికీ ఇంగ్లీషు భాషపై పట్టులేకపోవడం వల్ల కేవలం 131 మంది మాత్రమే ఉద్యోగాలు పొందారు. అయితే ఇంటర్వ్యూలో ఫెయిల్ అయ్యిన అభ్యర్థులు ఇంగ్లీషులో ప్రత్యేక శిక్షణ తీసుకుని వచ్చే నెల మరోసారి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఆయన అభినందనలు తెలిపారు.

ఏజెన్సీలో ముమ్మరంగా వాహనాల తనిఖీ

మోతుగూడెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతివాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ నేపథ్యంలో చింతూరు మండలంలో మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ, సిబ్బంది, సీఆర్పీఎఫ్ ఏ పార్టీ టు బెటాలియన్, సీఆర్పీఎఫ్ సిబ్బంది ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు సోదాలు చేశారు. ఇతర ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ట్రైనింగ్ ఎస్ఐలు సీతారాం, చంటి తదితరులు పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ శివనారాయణ, పోలీస్ సిబ్బంది, సీఆర్పీఎఫ్‌పీ 42 బెటాలియన్ ట్రైనింగ్ ఎస్ఐలు

రోడ్డు ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మృతి

బుల్లెట్‌పై వెళ్తుండగా గామన్ వంతెన వద్ద ఘటన



పాస్టర్ ప్రవీణ్‌కుమార్ (ఫైల్)



ఘటనా స్థలం వద్ద ప్రవీణ్‌కుమార్ మృతదేహం

రాజానగరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గామన్ బ్రిడ్జి రహదారిపై కొంతమూరు నయారా పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ మృతి చెందారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్ మంగళవారం విలేకర్లకు తెలిపారు. హైదరాబాద్ తిరుమలగిరి సమీపంలోని ఎస్‌టీఎహెచ్ కాలనీకి చెందిన పగడాల ప్రవీణ్‌కుమార్(46) అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకుడిగా కొనసాగుతున్నారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వెనుక లగేజీ బ్యాగ్ కట్టుకుని సోమవారం రాత్రి రాజమహేంద్రవరం బయలుదేరారు. రాజమహేంద్రవరంలో స్నేహితుడి ఇంటికి వెళ్తున్నానని, భార్యకు చెప్పి బుల్లెట్‌పై బయలుదేరినట్టు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో మార్గమధ్యలో సోమవారం అర్ధరాత్రి కొంతమూరు సమీపంలోని నయారా పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి మోటార్‌సైకిల్ అదుపుతప్పి రహదారి నుంచి పల్లపు ప్రాంతానికి పడిపోవడంతో మోటార్‌సైకిల్ ప్రవీణ్‌కుమార్‌పై పడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మర్నాడు ఉదయం వరకు ఎవరూ గమనించలేదు. మంగళవారం ఉదయం తమకు వచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించామని, బుల్లెట్‌తో సహా ప్రవీణ్‌కుమార్ రహదారి పైనుంచి కిందికి జారిపోవడం, బుల్లెట్ ఆయనపై పడిపోవడంతో మృతిచెందినట్టు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఎస్ఐ మనోహర్ కేసు నమోదు చేశారు.

పాస్టర్ మృతిపై క్రైస్తవ సంఘాల నాయకుల ఆగ్రహం

రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధన ఆసుపత్రి ఎదుట నిరసన, ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ క్రైస్తవ సువార్తికుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మంగళవారం తెల్లవారుజామున కొంతమూరు-ఆటోనగర్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటనపై తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, పలువురు మతపెద్దలు, రాజకీయ నాయకులు భగ్గుమన్నారు. ఇది రోడ్డు ప్రమాదం కాదని, పాస్టర్ ప్రవీణ్‌ను ఆయన వ్యతిరేకులు ఎవరో చంపేశారని అనుమానం వ్యక్తం చేస్తూ మంగళవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి తమకు న్యాయం చేయాలని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వాసుపత్రి ఎదురుగా ఉన్న ప్రాంతం ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. రెండు, మూడు గంటలపాటు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి ధర్నాను తాత్కాలికంగా విరమింప చేశారు. ఈ ఆందోళనలో మాజీ ఎంపీ హర్షకుమార్, రాజేష్ మహాసేనతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలు, రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ పాస్టర్లు జాన్ వెస్లీ, జేమ్స్, విజయరాజు వంటి వారితోపాటు క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు క్రైస్తవసంఘ నాయకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందలేదనే అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు ఈ విషయంలో నిష్పాక్షికమైన దర్యాప్తు చేయాలని కోరారు. కాగా అంతకుముందు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీలో ఉంచిన ప్రవీణ్ మృతదేహాన్ని పలువురు సందర్శించారు.

ప్రవీణ్ మృతిపై ఐదు ప్రత్యేక విచారణ బృందాలు : ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై కొందరు అనుమానాస్పదంగా ఉందని ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఈ సంఘటనపై విచారణకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పోలీస్ బృందాలు పారదర్శకంగా, ఎటువంటి డివియేషన్స్ లేకుండా కేసును సరైన పద్ధతిలో విచారణ చేస్తున్నాయన్నారు. ఇతరుల మనోభావాలు, మానాభిమానాలు దెబ్బతినేలా, కుల,మత రాజకీయవర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా, మతపరమైన, సున్నిత అంశాల్లో వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగించేలా సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారాలను వ్యాప్తి చేసి ప్రజలను రెచ్చకొడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు ఉన్నాయని, గుర్తిస్తే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.



రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద మాజీ ఎంపీ హర్షకుమార్, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు

ముళ్ల కంచెలో ముక్కుపచ్చలారని పసిబిడ్డ

- పోతవరంలో అమానుషం
- కుక్కలు పీక్కు తింటుండగా అడ్డుకున్న రైతులు
- ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స, పరిస్థితి విషమం



కుక్కలు తినేసిన శిశువు తలభాగం



పోతవరం పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో మంగళవారం అమానుష ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోతవరం- యర్నగూడెం రోడ్డులో పొగాకు బ్యారన్స్ దగ్గర ఉన్న ముళ్లపొదల్లో ముక్కుపచ్చలారని ఆడశిశువును గుర్తు తెలియని వ్యక్తులు పడేసి వెళ్లిపోయారు. ఉదయం పాలు తీసుకురావాడానికి అటుగా వెళ్తున్న రైతులు శిశువును కుక్కలు పీక్కుతినడం చూసి వాటి నుంచి శిశువును కాపాడి వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఏఎన్ఎం మహాలక్ష్మి,గ్రామ సంరక్షణ అధికారి దీపక సంఘటనా స్థలానికి వెళ్లి రక్తపు మడుగులో ఉన్న శిశువును తీసుకుని వచ్చి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం డాక్టర్ రాజశేఖర్ శిశువును పరిశీలించి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శిశువుకు డీఎన్ ఏ పరీక్షలు నిర్వహించి రక్తం ఎక్కించారు. నల్లజర్ల సీఐ వై.రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి వెళ్లిన సీఐ సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సీడీపీవో నాగలక్ష్మి, ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఏలూరు వెళ్లి శిశువును పరిశీలించి సంరక్షణ కోసం ఇద్దరి ఆయాలను అక్కడ ఉంచారు. మరో 48 గంటలు దాటితే తప్ప ఆరోగ్య పరిస్థితి చెప్పలేమని వైద్యులు తెలిపినట్టు సీడీపీవో నాగలక్ష్మి తెలిపారు. ముక్కుపచ్చలారని పసిబిడ్డను ముళ్ల కంచెలో విసిరి వేయడానికి మనసు ఎలా వచ్చిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పోతవరంలో ఇతర ప్రాంతాల నుంచి పొగాకు పనులు చేసుకునేవారు వందల సంఖ్యలో ఉంటారని, వారే గుట్టుచప్పుడు కాకుండా శిశువును విసిరి వేసి ఉంటారని గ్రామస్థులు భావిస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



రాంబాబు(ఫైల్)

జగ్గంపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో సిగిరెడ్డి రాంబాబు(59) మృతిచెందాడు. వివరాల ప్రకారం.. జగ్గంపేటకు చెందిన సిగిరెడ్డి రాంబాబు రామవరం హైవేలో ఉన్న లారీ యూనియన్ ఆఫీసుకి బైక్‌పై వెళ్తుండగా రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళుతున్న కారు బైక్‌ను బలంగా ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న రాంబాబు రోడ్డుపై పడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురానికి తరలించినట్టు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

బస్సు, బైక్ ఢీ

ఇద్దరికి గాయాలు



ప్రమాద స్థలం వద్ద క్షతగాత్రులు

పెద్దాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల బస్సు, మోటార్ సైకిల్ ఢీకొనగా ఇద్దరు గాయపడిన సంఘటన కాకినాడ జిల్లా పెద్దాపురం మండల పరిధిలోని కాండ్రకోట గ్రామంలో మంగళవారం జరిగింది. సామర్లకోట కేఎస్ఎన్ పాఠశాలకు చెందిన బస్సు కాండ్రకోట మర్లావ రహదారి మధ్యలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో జగ్గంపేట మండలం కాట్రావులపల్లికి చెందిన కంచుమర్తి వెంకటేష్, చీట్నీడి అమ్మన్న గాయాలపాలయ్యారు. చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించినట్టు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం

- తాత వరసైన వ్యక్తి ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఎటపాక, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అభం, శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి ఆడుకుంటుండగా తాత వరసైన వ్యక్తి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట పంచాయతీ పరిధిలో జరిగింది. ఈనెల17న ఉదయం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న చిన్నారిని ఎదురింట్లో ఉండే తాత వరసైన వ్యక్తి మడకం చిట్టిబాబు (42) చేయి పట్టుకుని తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. చిన్నారిపై అఘాయిత్యం చేసి బయటకు తీసుకువచ్చాడు. ఆరోజు రాత్రి చిన్నారి నొప్పిగా ఉందని, జరిగిన విషయం తల్లికి చెప్పింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులు న్యాయం చేయాలంటూ కులపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. కులపెద్దల సమక్షంలో న్యాయం జరగకపోవడంతో మంగళవారం బాధిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులతో పాటు ఇరుగు,పొరుగువారిని విచారించారు. అత్యాచారం జరిపిన ఇంటి ప్రాంతాన్ని పరిశీలించారు. వైద్యపరీక్షల నిమిత్తం చిన్నారిని చింతూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

మహిళ స్నానం చేస్తుండగా వీడియోలు తీసి కోరిక తీర్చాలంటూ వేధింపులు

ఇద్దరిని అరెస్ట్ చేసిన అనపర్తి పోలీసులు

అనపర్తి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మహిళ స్నానం చేస్తుండగా చాటుగా వీడియోలు చిత్రీకరించి ఆమెను బ్లాక్ మెయిల్ చేస్తూ కోరిక తీర్చాలంటూ వేధించడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు అనపర్తి ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు. వివరాల ప్రకారం..తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పీరా రామచంద్రపురానికి చెందిన నల్లమిల్లి మణికంఠరెడ్డి(అయ్యప్ప), కర్రి రామకృష్ణారెడ్డి అదే గ్రామానికి చెందిన మహిళ స్నానం చేస్తుండగా వీడియో చిత్రీకరించారు. సంఘటన జరిగి సుమారు నాలుగు నెలలు గడచింది. నాటి నుంచి మహిళకు ఆ వీడియోలు చూపి రూ.లక్ష ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. అయితే తాను డబ్బులు ఇవ్వలేనని బయటకు తెలిస్తే పరువుపోతుందని బ్రతిమాలుతూ వస్తుంది. చివరకు రూ.4వేలు ఇచ్చిన ఆమె ఇక డబ్బులు ఇవ్వలేనని, వీడియోలు డిలీట్ చేయాలని ప్రాధేయపడింది. తమ కోరిక తీరిస్తే వీడియోలు డిలీట్ చేస్తామని లేకుంటే సోషల్ మీడియాలో పెడతామని వారిద్దరు బెదిరించారు. చివరకు ఆమె వారి వేధింపులు తాళలేక విషయాన్ని భర్తకు చెప్పి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ నిర్వహిస్తున్నామని ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

అదుపు తప్పి పొలాల్లోకి దూసుకుపోయిన స్కూల్ బస్సు

40 మంది పిల్లలు సురక్షితం



కె.కొత్తూరు శివారున పంట పొలాల్లోకి దూసుకుపోయిన బస్సు

జగ్గంపేట రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేటలోని ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించిన స్కూల్ బస్సు జగ్గంపేట మండలం కె. కొత్తూరు గ్రామ శివారున అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయింది. స్కూలు ముగిసిన తరువాత పిల్లలను ఇంటికి తీసుకుని వెళ్తుండగా మార్గమధ్యలో ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో బస్సులో 40 మంది పిల్లలు ఉన్నారు. పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొని పొలాల్లోకి వెళ్లి ఆగింది. విద్యుత్ వైర్లు పక్కకు ఒరిగి అలా ఉండిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పిల్లలను బస్సులోంచి దించి వెంటనే వేరే బస్సులో వారి గమ్య స్థానాలకు చేర్చారు. గడ్డి బండి అకస్మాత్తుగా రావడంతో బస్సు అదుపు తప్పినట్టు డ్రైవర్ తెలిపాడు.

చెరువులో పడి వ్యక్తి మృతి

రెండురోజుల తర్వాత మృతదేహం లభ్యం



చెరువులో వీర పురుషోత్తం మృతదేహం

గొల్లప్రోలు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని చెరువులో పడి వ్యక్తి మరణించగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. గ్రామానికి చెందిన సలాది వీర పురుషోత్తం (37) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈనెల 23వ తేదీన బహిర్భూమికి గానూ పెద(కోటలంక వారి)చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి అతడి కోసం గాలిస్తుండగా మంగళవారం మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటనపై గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వడ్రంగి మృతి



మరణించిన ఏసురత్నం

కడియం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో వడ్రంగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కడియం గ్రామానికి చెందిన ఐసెట్టి ఏసురత్నం (49) ఈనెల 24న కడియపుసావరంలో ఎస్.సత్తిబాబు ఇంటికి వడ్రంగి పని నిమిత్తం వెళ్లి సాయంత్రం పనిచేస్తూ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. విషయాన్ని ఏసురత్నం కుమారుడికి తెలియపరిచారు. వెంటనే కడియం ప్రభుత్వాసుపత్రికి వైద్యం నిమిత్తం తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. మంగళవారం ఏసురత్నం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్‌కుమార్ కేసు నమోదు చేశారు.

చెట్టు మీద నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతిచెందిన బంగారునాయుడు

తునిరూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చెట్టు మీద నుంచి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం వి. కొత్తూరులో జరిగింది. వి.కొత్తూరు గ్రామానికి చెందిన రైతు బోజంకి బంగారు నాయుడు (41) తన పొలంలో చింత చెట్టు ఎక్కి చింతకాయలు తెంచే క్రమంలో కాలు జారి కింద పడడంతో తలకు బలమైన గాయమై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక మత్స్యకారుడి ఆత్మహత్య

కరప, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక మత్స్యకారుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరప మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన కొప్పనాతి గంగాధరరావు(65) చేపల వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అతడికి భార్య, ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న గంగాధరరావు మంగళవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. అయితే దీనిపై ఇంతవరకు తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సునీత చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

కాకినాడ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం కుమారప్రియంలో పెద్దాడ-గంగ్రేడునుంచి కైకవోలు వయా కుమారప్రియం వరకు రూ.90లక్షలతో బీటీ రోడ్ నిర్మాణానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కాంగ్రేగుల శివారు గుబ్బలవారి పాలెంలో రూ.35లక్షలతో కాంగ్రేగుల నుంచి గుబ్బల వారిపాలెం వరకు బీటీ రోడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.



ఉత్తమ రైతులను సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

ప్రకృతి సాగుపై దృష్టి సారించాలి

● జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

గొల్లప్రోలు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పంట ఉత్పత్తులను పొందడంపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ సూచించారు. ఖరీఫ్ యాక్షన్‌ప్లాన్-2025పై వ్యవసాయ అనుబంధశాఖల మండలస్థాయి సమన్వయ సమావేశం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరిగింది. ఈ సమావేశంలో రానున్న ఖరీఫ్ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఏయే పంటలు సాగు చేస్తారు, ఏటీఎం, ఏగ్రేడ్, ఐఎఫ్ఎస్ మోడల్స్ గురించి వివరించారు. ప్రకృతి ప్రణాళికలో అన్నిశాఖల అధికారులు భాగస్వామ్యం కావాలని విజయకుమార్ స్పష్టం చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ రైతులు పర్వత కొండబాబు, గవరసాని చంటిబాబు, సారెపల్లి నాగేశ్వరరావు, తుమ్మలపల్లి వెంకటరమణ, గుండ్ర గంగలను జిల్లా వ్యవసాయాధికారితో పాటు వివిధశాఖల అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎలియాజర్, వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, ఏవో సత్యనారాయణ, ఉద్యానవనశాఖాధికారి శైలజ పాల్గొన్నారు.

చెందుర్తి ప్రజలకు సురక్షిత తాగునీరు

● రూ.10లక్షలతో ఆర్వో ప్లాంట్ నిర్మాణం

● నిర్మించిన ఎలైట్ నేచురల్ ఆయిల్స్ కంపెనీ



గొల్లప్రోలు మండలం చెందుర్తిలో నూతనంగా నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంటు

గొల్లప్రోలురూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామస్తులకు అందరికీ ఉచితంగా శుద్ధిచేసిన సురక్షిత తాగునీటిని అందించేందుకు ఆ కంపెనీ ముందుకు వచ్చింది. రూ.10లక్షలు వెచ్చించి 48వేల లీటర్ల సామర్థ్యంతో ఆర్వో ప్లాంటును నిర్మించి అత్యాధునిక పరికరాలు సమకూర్చింది. ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించే ఏర్పాటు చేసింది.

గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామంలో తాగునీటి పథకాలు ఉన్నా ఆర్వో ప్లాంటులు అందుబాటులో లేవు. దీంతో కుళాయిల ద్వారా వచ్చే నీటినే వారు తాగునీరుగా వినియోగిస్తున్నారు. దీనివలన ప్రజలు తరచూ వివిధ రకాల ఇబ్బందులకు గురికావడంతోపాటు నీటి సంబంధమైన వ్యాధులతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని చెందుర్తి పరిధిలోనే ఉన్న ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ లిమిటెడ్ కంపెనీ దృష్టికి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు తీసుకువెళ్లారు. దీంతో గ్రామానికి అంతటికి సురక్షిత శుద్ధిచేసిన నీటిని అందించేందుకుగానూ ఆర్వో ప్లాంటు నిర్మాణానికి కంపెనీ ప్రతినిధులు ముందుకు వచ్చారు. గ్రామపంచాయతీ స్థలం కేటాయించింది. కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.10లక్షలతో అత్యాధునిక ఆర్వోప్లాంటు సమకూర్చడంతోపాటు అందుకు అవసరమైన భవనాన్ని నిర్మించారు. ఆర్వో వాటర్ ప్లాంటు ద్వారా గంటకు రెండు వేల లీటర్ల నీటిని శుద్ధిచేసే అవకాశం ఉంది. రోజు 48వేల లీటర్ల నీటిని సరఫరా చేసే కెపాసిటీ ఉండటంతో గ్రామ ప్రజలకు పూర్తిస్థాయి శుద్ధిచేసిన సురక్షితనీటిని అందించే వీలుంది. ఈ ఆర్వో వాటర్‌ప్లాంటును బుధవారం ప్రారంభించనున్నా రు. ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ ఆర్వోప్లాంటు నిర్మించామని ఎలైట్ నేచురల్ ఆయిల్స్ అండ్ ఫ్యూయల్స్ కంపెనీ డైరెక్టర్ పీఎస్‌సీ గోవిందు తెలిపారు.

30 నుంచి భీమేశ్వరాలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

సామర్లకోట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి పొందిన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో ఈనెల 30నుంచి ఏప్రిల్ 4వరకూ జరుగనున్న విశ్వావసునామ సంవత్సర శ్రీవసంత నవరాత్రి ఉత్సవాలు పెద్దఎత్తున నిర్వహి ంచనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజులపాటు ప్రతీరోజూ భీమేశ్వరస్వా మికి, బాలాత్రిపురసుందరి అమ్మవార్లకు ఏకా దశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి నవావర్ణార్చన పూజలు, లలితా అష్టోత్తర సహస్రనామాలు, కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్పములు తదితర విశేష పూజలలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు. అంతకుముందు ఆలయంలో మంగ ళవారం ఉదయం స్వామివారికి, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

ప్రకృతి వైపరీత్యాల చర్యలపై మాక్‌డ్రిల్

● జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 25(ఆంధ్రజ్యోతి): వరదలు, తుపాన్‌లు ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన తక్షణ సహాయకచర్యలు సంసిద్ధతపై ఈనెల 29న తాళ్లరేవు మండలం కొత్తలంక గ్రామంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం విపత్తుల నిర్వహణపై ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు చేపట్టాల్సిన సహాయక చర్యలపై అధికారులతో సమావేశం నిర్వహించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 29న తాళ్లరేవు మండలం కొత్తలంకలో విపత్తుల నిర్వహణపై ప్రకృతి వైప రీత్యాలు సంభవించినప్పుడు తక్షణ సహాయక చర్యలుకోసం మాక్‌డ్రిల్‌లో ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మాక్‌డ్రిల్‌కు 28న నిర్వహించే టేబుల్ టాప్ ఎక్సర్‌సైజ్‌కు ఆ యాశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనా లన్నారు. అనంతరం రెవెన్యూ, వైద్యఆరోగ్యం, అగ్నిమాపక, ప్రజారవాణా, ఇరిగేషన్, వ్యవసా యం, పౌరసరఫరాలు, రోడ్డుభవనాలు తదితర శాఖల అధికారులను విపత్తులు సంభవించి నప్పుడు తీసుకోవాల్సిన చర్యలను అడిగి తెలుసు కున్నారు. ఈకార్యక్ర మంలో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి రాజేష్, పౌరసరఫరాల సంస్థ డీఎం దేవులా నాయక్. ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ భారతి, తాళ్లరేవు తహసీల్దార్ త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.

విక‌సిత్ భారత్ రాష్ట్రస్థాయి పోటీలకు
యూసీఈకే విద్యార్థిని ఎంపిక



అలేఖ్యను అభినందిస్తున్న వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న ఆదిత్య యూనివర్శిటీలో నిర్వహించిన జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యూసీఈకే) ఎంసీఏ విద్యార్థిని జీఎస్ఎస్ అలేఖ్యను జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ మంగళవారం తన ఛాంబర్లో అభినందించారు. వీసీ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్రమోదీ దార్శనికత నుంచి ప్రేరణ పొందిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌లో యువత భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.వికసిత్ భారత్-2047కోసం విజన్ డాక్యుమెంట్ రూపొందించేందుకు ఒక మంచి వేదికని తెలిపారు. ఈనెల 28న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగనున్న రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్-2025 పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ జీవీఎస్ఆర్ దీక్షితులు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారిణి కిరణ్మయి పాల్గొన్నారు.

'ఉచిత విద్యుత్‌ను చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోండి'



మాట్లాడుతున్న పర్సన్ ఇన్‌చార్జి ఫణిబాబు

పెద్దాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్‌ను అర్హులైన చేనేత కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని చేనేత అభివృద్ధి అధికారి పెద్దాపురం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఎస్వీ ఫణిబాబు అన్నారు. మంగళవారం స్థానిక భాస్కర్‌కాలనీలోని ముప్పన రామారావు చేనేత సహకార సంఘ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన చేనేత సహకార సంఘ మహాజన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మగ్గంపై నేత నేసే వారికి కాకుండా చేనేత పరిశ్రమపై ఆధారపడి కండెలు చుట్టేవారు, నూలు డబ్బాలు తోడేవారు, ఆసు ఇసిరేవారు, అచ్చులు అతికేవారు, రంగులు వేసే కార్మికులకు కూడా ఈ ఉచిత విద్యుత్ అమలు జరుగుతుందన్నారు. మహాజనసభలో సొసైటీ మేనేజర్ తూతిక చంద్రశేఖర్ ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ 239 మంది సభ్యులున్న ఈ సహకార సంఘంలో 120 మందికి మగ్గాలున్నాయన్నారు. వీరిలో 60 మంది కార్మికులు సొసైటీకి వస్త్రాలు నేస్తున్నారన్నారు. ఆప్కో జిల్లా మాజీ డైరెక్టర్, సొసైటీ మాజీ అధ్యక్షులు ఎం.వీర్రాజు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

కూరాడలో రిలే దీక్ష విరమణ

కరప, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కూరాడలో అక్రమ చర్చి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ హైందవ సైన్యం ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షను అధికారుల చొరవతో గ్రామస్తులు విరమించారు. 40ఏళ్లుగా ఇక్కడ చర్చిని నిర్వహిస్తున్నామని, తమకు న్యాయం చేయాలంటూ చర్చి పాస్టర్ పి.స్వర్గన్‌రాజు కొంతమంది పాస్టర్లతో కలిసి మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. గ్రామస్తుల దీక్షాశిబిరం పక్కనే వారు కూడా టెంట్‌వేసి నిరసనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. సమాచారం అందుకున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ, కరప ఎస్ఐ తోట సునీత, ఎంపీడీవో మట్టపర్తి అనుపమ, ఈవోపీఆర్డీ సలాది శ్రీనివాసరావులు శిబిరం వద్దకు వెళ్లి ఇరువర్గాలతో చర్చించారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా ఆందోళన చేయడాన్ని తప్పుబట్టిన అధికారులు శిబిరాలను తొలగించాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ చర్చిని నిర్మించమని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని గ్రామస్తులు స్పష్టంచేశారు. దీంతో పాస్టర్లతో అధికారులు మాట్లాడి తమ నిర్ణయాన్ని తెలపాలని సూచించారు. తమకు పదిరోజుల గడువు ఇవ్వాలని, చర్చి నిర్మాణమా.. లేదా ఇల్లు కడతామనేది చెబుతామని పాస్టర్లు తెలిపారు. అయితే అప్పటి వరకు శిబిరాలను తొలగించాలని అధికారులు సూచించడంతో ఇరువర్గాలు ఆందోళనను విరమించారు. పంచాయతీ కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మలబార్ మెరిట్ స్కాలర్‌షిప్ అందజేత

కాకినాడ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక జగన్నాధపురం ఎంఎస్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థినులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. స్థానిక జగన్నాధపురంలోని ఎమ్మెల్యే నివాసంవద్ద మంగళవారం సాయంత్రం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రూ.62 వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి జీజీకే నూకరాజు, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ అనుబంధ మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సాయి శ్రీకాంత్, పి.శ్రీరామ్, చారిటీస్ అసిస్టెంట్ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.విజయకుమారి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్లు పంపిణీ

పిఠాపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. పాఠశాలలో సంక్రాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి 35 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పి.లక్ష్మణరావు, వైస్‌చైర్మన్ భవానీ, కౌన్సిలర్లు రాయుడు శ్రీనుబాబు, అల్లవరపు నగేష్, హెచ్ఎం వీవీ రామకృష్ణ, సంస్థ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

చిత్రాడలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



చిత్రాడలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న అధికారులు

పిఠాపురంరూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం చిత్రాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. పోషణ్ బీ, పఢాయి బీకార్యక్రమంలో భాగంగా మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు ఎదుగుదలకు నవచేతన, మూడు నుంచి ఆరు సంవత్సరాలలోపు చిన్నారులకు అభివృద్ధికి ఆదర్శ కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్‌ఎస్‌కే దుర్గాదేవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపుపై శిక్షణ

కరప, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పోషణ బీ-పఢయి బీ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ వర్కర్లకు మూడురోజుల పాటు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ కాకినాడరూరల్ ప్రాజెక్టు సీడీపీవో యాసరపు లక్ష్మి తెలిపారు. నడకుదురు హైస్కూల్‌లో మంగళవారం శిక్షణా తరగతులను ప్రారంభించి ఆమె మాట్లాడారు. ఈనెల 27వ తేదీ వరకు నిర్వహించే ఈ శిక్షణా తరగతుల్లో చిన్నారుల్లో విద్యాప్రమాణాల పెంపు, సరైన పోషకాహారాన్ని పిల్లలకు అందించే విధానాలపై అవగాహన కల్పిస్తామన్నారు. దీంతోపాటు ఎర్లీ చైల్డ్‌ఉడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, 0-3 సంవత్సరాల చిన్నారులకు నవచేతన, 3-6ఏళ్ల పిల్లలకు ఆదర్శశీలలపై శిక్షణనందిస్తామని వివరించారు. గొర్రిపూడి, నడకుదురు సెక్టార్ల పరిధిలోని 43 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ శిక్షణ అందిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.వి.జయలక్ష్మి, కె.అన్నపూర్ణ, డీఈవో ఎం.సీత, ఉషారాణి, విష్ణు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంఘ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ దుర్గాప్రసాద్

కరప, మార్చి 25: సంఘంద్వారా అందిస్తున్న సేవలను సభ్యులు సద్వినియోగం చేసుకుని సంఘాభివృద్ధికి సహకరించాలని జడ్.బావారం సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్ ఎన్‌వీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక సంఘ భవనంలో మం గళవారం జరిగిన మహాజనసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘ కార్యకలాపాలు, సాధించిన ప్రగతిని సభ్యులకు వివరించారు. సొసైటీ సీఈవో రాయుడు వెంకటేశ్వరరావు(చిట్టియ్య) 2024-25ఆర్థిక సంవత్సరంలో సంఘం ద్వారా చేసిన జమాఖర్చులను, రుణాలు, లాభాలను సభ్యులకు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. వాయిదా మీరిన బకాయిదారుల పేర్లను ఈ సందర్భంగా సభలో చదివి వెంటనే జమచేయాలని కోరారు. సంఘంలో సభ్యుడిగా చేరిన రైతు తనకు సంబంధించిన వివరాలను ఆధార్ కేవైసీ ద్వారా సంఘంలో నమోదు చేసుకునేందుకు ప్రతిపాదించారు. సంఘ బైలా నెంబర్ 8ఎను సవరణ ద్వారా చేర్చుటకు, తదనుగుణంగా రిజిస్ట్రేషన్ చేయా ల్సిందిగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్‌ను కోరుతూ తీర్మానించారు.



జడ్.బావారం సొసైటీ మహాజనసభ నిర్వహిస్తున్న దృశ్యం

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించండి

● ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన విజ్ఞప్తి

చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించి సహకార సంఘాలను బలోపేతం చేయాలని ఆప్కో జిల్లా మాజీ డైరెక్టర్, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ముప్పన వీర్రాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చేనేత సంక్షోభంవల్ల చేతినిండా పనిలేక చేనేత కార్మిక కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. 2018 ఫిబ్రవరిలో చేనేత పాలకవర్గాల పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పటివరకు పాలకవర్గాల ఏర్పాటుకు ఎన్నికలు జరగకుండా కమిటీలు, పర్సన్ ఇన్‌చార్జిలు ద్వారా కాలం గడుపుతున్నారన్నారు. చేనేత కార్మికులకు ఉచిత కరెంటు అమలు చేయడం అభినందనీయమన్నారు. చేనేత పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు అన్ని రకాల పథకాలు అమలు చేయాలని కోరారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే రాజకీయ ప్రచారజాత

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగ ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగ ప్రభాకర్

కాకినాడ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు భారత కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ ప్రచార జాతలను చేపట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగ ప్రభాకర్ వెల్లడించారు. సీపీఐ కాకినాడ జిల్లా కౌన్సిల్ విస్తృతస్థాయి సమావేశం మంగళవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగింది. సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ముఖ్యవక్తలుగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగ ప్రభాకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తలు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ప్రచారజాతను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. వందేళ్ల చరిత్రగల కమ్యూనిస్ట్ పార్టీ పేదల కోసం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పునాదికి కీలకపాత్ర వహించడంతో పాటు అనేక భూపోరాటాలు చేసిందన్నారు. సీపీఐకు ప్రజా సంఘాలు పట్టుకొమ్మలాంటివని, జాతీయ మహాసభలు, రాష్ట్ర మహాసభలు త్వరలో జరుగనున్నాయన్నారు. వీటికి ముందు జిల్లా, మండల మహాసభలు జరుపుకోవాలన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రజల పార్టీ అని, ప్రజలే బ్రతికించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, .ఇల్లా కార్యవర్గ సభ్యులు బొబ్బిలి శ్రీనివాస్, పప్పు ఆదినారాయణ, కేశవరపు అప్పలరాజు, మహిళా సమైక్య జిల్లా కన్వీనర్ ఆరుగుల భవాని పాల్గొన్నారు.

నవోదయకు విద్యార్థుల ఎంపిక



చేబ్రోలులో నవోదయకు ఎంపికైన విద్యార్థులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నవోదయలో ప్రవేశానికి జరిగిన పరీక్షల్లో గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గ్రామంలోని గౌతమి ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు ముత్యాల పవన్‌వర్మ, కంచర్ల దీపక్ శాంసన్, యండపల్లి మనోహర్‌లు ఎంపికకాగా వీరిని పలువురు ప్రజాప్రతినిధులు, విద్యాశాఖాధికారులు అభినందించారు.



రోహిత్, ఆకుల సుకుమార్

సామర్లకోట: పెద్దాపురం జవహర్ నవోదయ విద్యాసంస్థలో ఆరవ తరగతిలో ప్రవేశానికి నిర్వహి ంచిన అర్హతాపరీక్షలలో జీ.మేడపాడు గ్రామ గాంధీ గ్రామ్ మండల పరిషత్‌ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఏబీఎస్ఎస్ రోహిత్, ఆకుల సుకుమార్‌లు ఎంపికైనట్లు సామర్లకోట మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య మంగళవారం తెలిపారు. వీరికి ఎంఈవోలు శివరామకృష్ణయ్య పట్టపగలు పుల్లయ్య, తెలుగురైతు కాకినాడ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేచెల్ కుమారి, సత్యనారాయణ, పద్మావతిలు అభినందించారు.

చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండ

● కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడసిటీ, మార్చి25 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని, వీరికోసం ప్రవేశపెట్టిన సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన కాకినాడ చిన్నతరహా పాలవర్తక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం సిటీ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెమ్మనబోయిన సాయి రామ్, ఉపాధ్యక్షుడు సూరంపూడి కృష్ణ, కార్యదర్శి కాళ్ల సూర్యారావు, సంయుక్త కార్యదర్శి మహదాసు శ్రీను, కోశాధికారి వాసంశెట్టి భాస్కరరావు, సంయుక్త కోశాధికారి కళ్యాణపు శ్రీను, కన్వీనర్ జ్యోతుల సముద్రం, సలహాదారుడు వంగలపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబును కలిసిన చిన్నతరహా పాలవర్తక సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

● జడ్జి నిరుప భాన్జ్ డీయో



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి నిరుప భాన్జ్ డీయో

సర్పవరం జంక్షన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలపై లైంగికవేధింపులు, నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే చట్టం పోక్సో చట్టమని, ప్రతీఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని కాకినాడ నాలుగో అడిషనల్ జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ నిరుప భాన్జ్‌డీయో కోరారు. మంగళవారం కాకినాడ రూరల్ పి.వెంకటాపురంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలపై జరుగుతోన్న లైంగిక దాడుల నుంచి రక్షణ (పోక్సో) చట్టంపై అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థి దశలో చదువుపై ధ్యాస ఉంచి నాణ్యమైన విద్యనేర్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. చిన్న వయసులో ఆకర్షణలకులోనై విలువైన జీవితాలను పాడుచేసుకోరాదన్నారు. పోక్సో కేసుల్లో అధికంగా ప్రేమ వ్యవహారాల్లోనే వస్తున్నాయన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, లైంగిక వేధింపుల వంటి అకృత్యాలను అడ్డుకుని రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం పోక్సో చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా బాలికలు, మహిళల రక్షణకోసం ఉన్న పలు చట్టాలు, న్యాయసేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం గురుకులంలో లభిస్తున్న సేవలు, విద్యాబోధన, వసతిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, తిమ్మాపురం పోలీసులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు..ఆరోగ్యానికి ముప్పు..!



పెదకొత్తూరు-యండమూరు రోడ్డులో ఎగసిన పొగ

కరప, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాల్లో రహదారులు చెత్తకు కేంద్రాలుగా మారుతున్నాయి. రోడ్డుపక్కనే కుప్పలుగా వ్యర్థాలను పారబోసి వాటికి నిప్పు పెడుతుండడంతో వాయు కాలుష్యం అమాంతం పెరిగిపోతుంది. చెత్త నుంచి సంపద తయారీకేంద్రాల ఉద్దేశాన్ని నీరుగార్చుతూ పల్లెలను పొగబార్చుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తను అంటించడంవల్ల పొగ రోడ్లను కమ్మేసి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పెదకొత్తూరు పరిధిలో సిరిగలపల్లిలంక, యండమూరు గ్రామాలకు వెళ్లే దారిలో వేసిన చెత్తకు నిప్పుపెట్టడంతో ఆ రూట్లో వెళ్లిన పలువురు నానా ఇబ్బందులకు గురయ్యారు.

'నా భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు'

ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గ్రామానికి చెందిన ఇరటా లక్ష్మి తన భూమికిలోకి వెళ్లకుండా కొంత మంది వ్యక్తులు అడ్డుకుంటున్నారని, దీని మీద పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ వీడియో రిలీజు చేశారు. కలెక్టర్, ఎస్పీలు మాకు న్యాయం చేయాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గడిబాపనమ్మ ఉత్సవాలకు ఏర్పాటు పూర్తి

అమ్మవారికి పట్టువస్త్రాలు అందించిన ఎమ్మెల్యే దంపతులు



అమ్మవారికి పట్టువస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి దంపతులు

రంపచోడవరం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతపల్లి శ్రీగడి బాపనమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత గ్రామస్థులు అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం అమ్మవారికి ఉయ్యాల సేవ అర్చకులు బత్తిన రామ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిపారు. ఆరు రోజులు జరిగే ఉత్సవాలకు భక్తులు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆయల కార్యనిర్వాహణాధికారి గండేపల్లి సత్య రమేష్, విశ్వహిందూ పరిషత్ కార్యవర్గ సభ్యులు నల్లమిల్లి వెంకట రామారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాలమ్మ జాతర

అడ్డతీగల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం దుర్భర్తి గ్రామంలో వెంచేసి ఉన్న నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ఉగాది వరకు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అయిదు రోజులు పాటు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహిస్తామ న్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలు ఏర్పాటు చేశామని గ్రామ సర్పంచ్ పల్లాల నాగరత్నం, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని జాతర కమిటీ కోరింది.



దుర్భర్తిలోనున్న నూకాలమ్మ అమ్మవారు

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు



గరగలకు పూజలు చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలోని శ్రీనూకాలమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు ఉగాది పండుగతో ముగుస్తాయి. అమ్మవారికి దీపారాధన నైవేద్యాలు సమర్పించారు. మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు, మోతుగూడెం గ్రామస్తులు, కమిటీ నిర్వాహకులు అమ్మవారికి సంబంధించిన పలు పాత్రలను సీలేరు నదిలో శుభ్రపరిచి అమ్మవారి గరగలను మేళతాళాలతో, భాజాభజంత్రీలతో మోతుగూడెం పుర వీధుల్లో ఊరేగించి పూజలు ప్రారంభించారు.

రేపు ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

వీఆర్‌పురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై గురువారం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో పీఆర్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని 11 గ్రామ పంచాయతీల పరిధిలో 2023-24 సంవత్సరాల్లో ఫారెస్టు, పంచాయతీరాజ్, హౌసింగ్, వెలుగు తదితర శాఖల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ రేఖపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ తనిఖీకి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధి కూలీలు, ఉపాధి సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

టీఏసీ ట్రైబల్ అడ్వైజర్ కమిటీ భవనాన్ని నిర్మించాలి

దేవీపట్నం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు-1లో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి రామన్నదొర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఆదివాసీ టీఏసీ ట్రైబల్ అడ్వయిజర్ కమిటీ భవనాన్ని తక్షణమే అమరావతిలో నిర్మించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీ పోరాటయోధులు ఫలితంగా వచ్చిన ఆదివాసీ హక్కులు, చట్టాలు భవిష్యత్‌లో కనుమరగయ్యే ప్రమాదం ఉందన్నారు. వాటి పరిరక్షణ కోసం ఆదివాసీ టీఏసీ ట్రైబల్ అడ్వయిజర్ కమిటీ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు చవలం శుభకృష్ణదొర, మడకం వరప్రసాద్ దొర, యలగాడ నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు కుండ్ల సాయిరాంరెడ్డి, నడిపూడి భాను శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి సదర్ స్లాట్‌లు ప్రారంభం

దేవీపట్నం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షనర్ల వెరిఫికేషన్ కారణంగా జనవరిలో విడుదల కావాల్సిన సదరమ్ స్లాట్లు తిరిగి ఏప్రిల్ 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి తెలిపారు. దివ్యాంగ సంఘాల విజ్ఞప్తి మేరకు వెరిఫికేషన్‌తో పాటు స్లాట్లు ప్రారంభించి, అర్హులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. ఏప్రిల్ 1 నుంచి ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు.

నవోదయకు సెయింట్ మేరిస్ విద్యార్థుల ఎంపిక

అడ్డతీగల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల సెయింట్ మేరిస్‌లో 5వ తరగతి చదువుతోన్న దుర్గా స్వాగత్, గీతా మాధురి 2024-25 నవోదయ ఫలితాల్లో అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ మినిమోల్ తెలిపారు. ప్రతి ఏడాది తమ పాఠశాల నుంచి నవోదయకు విద్యార్థులు ఎంపిక కావడం పాఠశాల విద్యా ప్రమాణాల స్థాయిని సూచిస్తుందన్నారు. నవోదయకు అర్హత సాధించిన చిన్నారులను పాఠశాల అధ్యాపక బృందం, చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు.



నవోదయకు ఎంపికైన విద్యార్థులు

కొండపోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

రంపచోడవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సబ్‌ప్లాన్ ఏరియాలో గిరిజనుల సాగులో ఉన్న కొండపోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ నాయకుడు వినోద్ మిశ్రా, ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ నాయకుడు వినోద్ మిశ్రా, ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన హక్కులు అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు సోమల కుశల, నాగులపల్లి అర్జునుడు, ఉల్లి తాతారావు, కూడే రాఘవ, మాతే దుర్గబాబు, ఉల్లి లవకుశల, మాతే లోవరాజు, ఈరాటం చంటిబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) వినోద్ మిశ్రా, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

పాఠశాలలను విలీనం చేయొద్దు

» దూరంగా ఉన్న వేరే పాఠశాలకు పిల్లలను పంపబోం
» విద్యాకమిటీలు, తల్లిదండ్రులు



అభిప్రాయాలు సేకరిస్తున్న ఎంఈవో

తొండంగి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో 13 పాఠశాలలను పక్కనున్న పాఠశాలల్లో విలీనంచేసేందుకు గతంలో విద్యా కమిటీల తీర్మానం కోరగా వారంతా తమ అంగీకారం తెలిపారు. తాజాగా జిల్లా ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు మంగళవారం మండల విద్యాశాఖాధికారులు షేక్ బాబ్జి, ఎ.సుబ్బిరెడ్డి రాత్రి వరకూ పదమూడు పాఠశాలల కమిటీ సభ్యులు, తలిదండ్రులతో సమావేశమయ్యారు. ఒక్క పాఠశాల మినహా మిగిలిన పాఠశాలలు అన్నీ విలీనాన్ని వ్యతిరేకించాయి. ఇప్పుడు ఉన్న విధంగానే పాఠశాలలను కొనసాగించాలన్నారు. పిల్లల్ని దూరంగా ఉన్న వేరే పాఠశాలకు పంపబోమని తేల్చిచెప్పారు. పైడికొండ బీసీ కాలనీవాసులు మాత్రమ సమీప పాఠశాలలో విలీనానికి అంగీకరించారు. మిగిలిన యూపీ వేమవరం, తలపంటిపేట, హంకుంపేట, ఎస్‌ఆర్ పేట, పాతకోదాడ కాలనీ, యూపీ గొర్సపాలెం, ఎంపీపీ తాటియాకుల పాలెం, ఎంపీపీ నర్సిపేట, కృష్ణాపురం కాలనీ, తొండంగి, నెంబర్ 1, ఎహెచ్ ఎస్ ఏ కొత్తపల్లి, నెంబర్1 ఏవినగరం పాఠశాలలు విలీనాన్ని వ్యతిరేకించాయి. ఎంఈవోలు విలీనానికి సంబంధించిన ప్రభుత్వ నిబంధనలు వివరించినప్పటికి గ్రామస్తులు అంగీకరించలేదు.

27న మోడల్ ప్రవేశ పరీక్షపై అవగాహన తరగతులు

శంఖవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూలులో ప్రవేశపరీక్ష రాసేవారికి ఈనెల 27 అవగాహన తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కే.కృష్ణవేణి తెలిపారు. ఉదయం 9నుంచి 11గంటల వరకూ జరిగే ఈ తరగతులకు అప్లికేషను దరఖాస్తుచేయని విద్యార్థుల ఆధార్‌తో పాటు తల్లి దండ్రుల ఆధార్‌కార్డులతో వస్తే దరఖాస్తు చేసుకునేందుకు సహకరిస్తామన్నారు.

నూకాలమ్మ జాతరకు ఏర్పాట్లు

కిర్లంపూడి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కొత్త అమావాస్య జాతరకు కిర్లంపూడిలో నూకాలమ్మతల్లి ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల కాంతులతో, చలువ పందిళ్లతో విద్యుత్ దీపాలంకరణల మధ్య ఆలయ కమిటీ సభ్యులు తీర్చిదిద్దుతున్నారు. తిరునాళ్లకు రంగుల రాట్నం, పిల్లలు ఊగేందుకు ఊయల వంటివి సిద్ధం చేస్తున్నారు.

రోడ్ల మరమ్మతులకు రూ.15.83 కోట్లు

ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లో రూ.15.83కోట్లు నిధులు విడుదల చేశారని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గానికి తాజాగా విడుదలైన నిధులతో బీటీ, సీసీ రోడ్లు ముమ్మరంగా వేయిస్తామని తెలిపారు. ఏలేశ్వరం మండలంలో సీసీ రోడ్లకు రూ.62లక్షలకు, ప్రత్తిపాడు మండలంలో సీసీ రోడ్లకు రూ.1.33కోట్లు, శంఖవరం మండలంలో సీసీ రోడ్లకు రూ.80లక్షలు, రౌతులపూడి మండలంలో సీసీ రోడ్లకు రూ.85లక్షలు విడుదల చేశామన్నారు. కొంతంగా కొత్తూరు మీదుగా అచ్చంపేటకు గొద్ది కొత్తపల్లికి రూ.2.20కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కత్తిపూడి జాతీయ రహదారి నుంచి వజ్రకూటం గ్రామానికి రూ.1.98కోట్లు, ఏలేశ్వరం మండలం యర్రవరంనుంచి తిరుమాలి వరకు బీటీరోడ్డుకు రూ.70లక్షలు, చిన్నింపేట హైవే నుంచి గెద్దనాపల్లిబీటీ రోడ్డుకు రూ.1.35కోట్లు, రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం నుంచి ఎస్ఎస్‌పట్నంకు రూ.2.60కోట్లు, రౌతులపూడి గిడదాం, బీవీపట్నం, మీదుగా లచ్చిరెడ్డిపాలెం రోడ్డుకు రూ.1.80కోట్లు, రాజవరం నుంచి దిగువ శివాడ గ్రామ రహదారులకు రూ.1కోటి, దిగువ శివాడ నుంచి గంగవరంకు రూ.60లక్షలు నిధులు విడుదలయ్యాయని ఈ నిధుల విడుదలకు తోడ్పాటునందించిన సీఎం, డిప్యూటీ సీఎంలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

ఖరీఫ్‌కు ప్రకృతి వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్

ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రకృతి వ్యవసాయంలో చేపట్టే పనులకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎలియాజర్ కోరారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మండల ప్రకృతి వ్యవసాయ రైతుల సమావేశం నిర్వ హించారు.. ఎలియాజర్ మాట్లా డుతూ 2025-26 ఖరీఫ్ వ్యవసాయ సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి 365రోజులు పంటలు పండించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్, మండల మహిళా సమాఖ్య ఏపీఎం వెంకట్రావు, ఏపీవో కుమార్ స్వామి, ఎంపీఎల్ నిఖేష్ శర్మ, చినబాబు, రామరాజులు, ఈవోఏలు, రైతులు పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ముగిసిన ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రాం

గండేపల్లి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ వారి సారథ్యంలో స్టూడెంట్ ఎనేబుల్‌మెంట్ ప్రోగ్రాం ఫ్రంట్ ఎండ్ వెబ్ టెక్నాలజీ మీద నిర్వహించిన ఐదు రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్‌కి విశేష సేవలందిస్తున్న మీనాక్షి వ్యాస్, లలిత బంగారే ఆన్‌లైన్‌లో రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో 200మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఎక్స్‌పో.. ఆదిత్య యూనివర్శిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ప్రాజెక్టు ఎక్స్‌పో 2025 నిర్వహించారు. కార్యక్రమాన్ని యూనివర్శిటీ డిప్యూటీ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీని వాసరెడ్డి ప్రారంభించారు.

బెంబేలెత్తిస్తున్న.. బాంబు బ్లాస్టింగ్

» పేలుడు ధాటికి బీటలువారిన 12 ఇళ్లు.. ఆందోళనలో కుమ్మరిలోవ వాసులు



దెబ్బతిన్న ఇళ్లను చూపిస్తున్న బాధితులు

తుని రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పోలవరం ఎడమ కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా కొండని తొలగించే క్రమంలో ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో బాంబ్ బ్లాస్టింగ్ పనులు జరుగుతున్నాయి. ప్రజలను అప్రమత్తం చేస్తూ కంట్రోల్ బ్లాస్టింగ్ చేయాల్సిన అధికారులు ఉదాసీనతతో కుమ్మరి లోవ వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ఎప్పుడు ఏ బండ వచ్చి మీద పడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. తాజాగా జరిగిన బాబు బ్లాస్టింగ్‌లో కుమ్మరిలోవలో 12ఇళ్లు పైబడి స్వల్పంగా దెబ్బతిన్నాయి. దీంతో గ్రామస్తులు ఆందోళన బాట పట్టడంతో ఇరిగేషన్ అధికారులు రంగంలోకి దిగారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దశగా చర్యలు చేపడతామని ఎస్‌సీ యేసుబాబు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు, డీఈ గోవింద్, మురళీమోహన్ తదితరులు ఉన్నారు.

తంటికొండలో నేలకొరిగిన వరి పొలాలు



జగ్గంపేటలో కురుస్తున్న వర్షం

జగ్గంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం తంటికొండ గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన అకాలవర్షానికి వరి పొలాలు నేలకు ఒరిగాయి. భారీ పంట నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ స్పందించి ఎమ్మార్వోను, వ్యవసాయ శాఖ అధికారులను, వీఆర్వోను పంట నష్టాలను అంచనా వేయాలని ఆదేశించడంతో వారు మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలియజేశారు. ఈ పరిశీలనలో బదిరెడ్డి అచ్చన్న దొర, బదిరెడ్డి బాబి, నాగం వెంకటపతి, గెడ్డంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో భారీ వర్షం

జగ్గంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో మంగళవారం సాయంత్రం 5గంటల నుంచివాతావరణంలో మార్పులు చేసుకోవడంతో మబ్బులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో డ్రైనేజీలు పొంగుపొర్లడంతో జాతీయ రహదారిపైన మురుగునీరు ప్రవహించింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ప్రత్తిపాడులో చిరుజల్లులు

ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు మండలం మంగళవారం చిరుజల్లులు పడ్డాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు పడ్డాయి.

అపరాల సాగుతో అధిక ఆదాయం: ఏవో

శంఖవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అపరాల సాగుతో రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొంతంగిలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి వేసివిలో అపరాలు సాగు, పచ్చిరొట్ట ఆవశ్యకత, దుక్కుల ప్రాముఖ్యతలను వివరించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. తరుణ్ రైతులు తదితరులున్నారు.



శంఖవరంలో మాట్లాడుతున్న ఏవో

మామిడి, జీడిమామిడి తోటల పరిశీలన

జగ్గంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజపూడి గ్రామంలో మామిడి, జీడిమామిడి తోటలను రామచంద్రాపురం ఉద్యానశాఖ శాస్త్రవేత్త సీహెచ్ చిన్నబ్బాయి, ఉద్యాన శాఖ అధికారిణి పి.లావణ్య పరిశీలించారు. రాబోయే కాలంలో పండుఈగ ఎరలు ఏర్పాటు చేసుకుంటే పంట కాపాడుకోవచ్చన్నారు.

చీడపీడల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో మామిడిపై ఆశించిన చీడపీడల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని రామచంద్రాపురం ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ చిన్నబ్బాయి సూచించారు. పెద్దిపాలెం గ్రామంలో మామిడితోటను ఏలేశ్వరం ఉద్యాన శాఖ అధికారి ఎ.శ్రీవల్లి ఉద్యాన సహాయకులు, రైతులతో కలిసి మంగళవారం పరిశీలించారు.

వికసిత్ భారత్ యూత్ పార్లమెంటుకు సాయిప్రదీప్ ఎంపిక

ఏలేశ్వరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంటుకు ఏలేశ్వరానికి చెందిన ఎస్.సాయిప్రదీప్ ఎంపికైనట్టు స్పార్క్ సంస్థ చైర్మన్ సందీప్ మంగళవారం తెలిపారు. సోమవారం విశాఖపట్నం గీతం యూనివర్సిటీ వేదికగా యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో సుమారు 100 మందిని సైబర్ నేరాలు, ప్రస్తుత టెక్నాలజీ, భారత రాజ్యాంగం పలు అంశాలపై స్క్రీనింగ్ ద్వారా ఎంపిక చేశారు. వారిలో శ్రీకాకుళం జిల్లా యూత్ పార్లమెంటుకు సాయిప్రదీప్ ప్రాతినిధ్యం వ్యహిస్తున్నట్టు ఆయన తెలిపారు.



రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంటుకు ఎంపికైన యువత

28న ఏలేశ్వరంలో జాబ్ మేళా

ఏలేశ్వరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కొండలరావు, జిల్లా ఉపాధి సంస్థ అధికారి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎల్ఐసీ ఆఫ్ ఇండియా, ఫార్మా, డైకిన్ వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి 19 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగులు ఈనెల 28న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తమ సర్టిఫికెట్లు తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

ఇళ్ల అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

ఏలేశ్వరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపర్తి గ్రామంలో ఆక్రమణలు చేసి ఇళ్లు నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాల్లో ఇష్టానుసారంగా రేకు షెడ్డులు నిర్మిస్తున్న పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. శ్మశానవాటికకు సంబంధించి సుమారు 2 ఎకరాలు ఉందని వాటి సమీపంలో పాకలు, షెడ్డులు వేసి స్థలాలను ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ కుశరాజుకు లిఖిత పూర్వకంగా వినతిపత్రం అందజేశారు. సత్యనారాయణ, వేణు, బుజ్జి, వెంకటరమణ పాల్గొన్నారు.

వ్యాపార సంఘం నూతన కార్యవర్గం ఎంపిక

ఏలేశ్వరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరంలో వర్తక వ్యాపార సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో శ్రీసత్యదేవ టెంట్‌హౌస్ వర్తక వ్యాపార సంఘం కార్యవర్గ ఎంపికకు సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా గూడవిల్లి అర్జునరావు, ఉపాధ్యక్షుడిగా కోన బాబు, సెక్రటరీగా గూడుపు కృష్ణ, జాయింట్ సెక్రటరీగా కృష్ణమోహన్, ట్రెజరర్‌గా బసా దుర్గాప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్

జగ్గంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతీ మంగళవారం జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ వారం తుమ్మలపల్లి హాజరై భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో సూరంపాలెం బాలు, రాజనాల శ్రీను, ఉలిసి ఐరాజు, మాదారపు వీరబాబు, బొడ్డుకొండ వెంకటరమణ, , కురుమల్ల నాగేశ్వరరావు, కనకరాజు, అడబాల వీరబాబు, గందం శ్రీనివాస్, డ్రిల్ గోకేడ రమణ, డ్రిల్ మాస్టారు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనం రూ.600 చెల్లించాలి

ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీలకు 200 రోజుల పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 పని వేత నం చెల్లించాలని మండల లిబరేషన్ మహాసభ తీర్మానించింది. స్థానిక చెరువుగట్టు వద్ద ఉన్న లిబరేషన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మండల లిబరేషన్ కార్యకర్తల మహాసభ నిర్వహించారు. భూమిని సాగు చేసుకునే పేదలకు హక్కు పత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం మండల లిబరేషన్ కమిటీ కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. మండల కమిటీ కార్యదర్శిగా మానుకొండ లచ్చబాబు, మరో11 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. సమావేశానికిముఖ్య అతిథిగా ఏగుపాటి అర్జునరావు హాజరయ్యారు. తాడి నాగేశ్వరరావు, అర్జునుడు, రేచుకట్ల సింహాచలం, రాజ్యమన్ని వెంకాయమ్మ, అనసూయ, లక్ష్మి, రాజమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి

జడ్జి శ్యామ్ సుందరి



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న జడ్జి లీలా శ్యామ్‌సుందరి

ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యాభివృద్ధి లక్ష్యాలు సాధించాలని ప్రత్తిపాడు కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి, మండల లీగల సర్వీస్ కమిటీ చైర్మన్ లీలా శ్యామ్‌సుందరి చెప్పారు. స్థానిక బీసీ బాలికల హాస్టల్‌ను మంగళవారం ఆమె సందర్శించి వారికి అందుతున్న ఆహార, వసతి సౌకర్యాలు పరిశీలించారు. బాలికల హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి చట్టప్రకారం రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులు వివరించారు. సమావేశంలో అడ్వకేట్ అవసరాల దేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, మధుబాబు, వార్డెన్ ఎం.శైలజ పాల్గొన్నారు.

నవోదయకు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

తొండంగి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నవోదయ ప్రవేశ పరీక్షలో విజయం సాధించి ఆరో తరగతిలోకి ప్రవేశం పొందేందుకు మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. శారదా ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదువుతున్న శృంగవృక్షం గ్రామానికి చెందిన జి.వర్షిణి, పంపాదిపేట ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన టి.పునీతేశ్వరి, రవితేజ పాఠశాలకు చెందిన ఎం.అభి, బెండపూడి ప్రకాష్ స్కూల్‌లో చదువుతున్న శృంగవృక్షం గ్రామానికి చెందిన కొంజర్ల వెంకట చంద్రమౌళి, పాత చోడిపల్లిపేటకు చెందిన చందక మురళీకృష్ణ, వాకదారిపేటకు చెందిన వై వైష్ణవి నవోదయకు ఎంపికయ్యారు. ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి అభినందనలు తెలిపారు.

కోటనందూరు నుంచి ఆరుగురు..

కోటనందూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలంలో 6వ తరగతి నవోదయ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. పాతకొట్టాం ఎంపీపీ ఎస్కూల్‌కు చెందిన బి.చంద్రిక, కెవోఅగ్రహారం ఎంపీపీ స్కూల్‌కు చెందిన మిరియాల అక్షయ్‌కుమార్, కెకొట్టాంకు చెందిన అడిగర్ల వత్స, కేఏ.మల్లవరానికి చెందిన రావడ చేతన్, జగన్నాథపురానికి చెందిన గాడి జిత్శ్రీ, బొద్దవరానికి చెందిన పొలమరశెట్టి సందీప్ ఎంపికయ్యారు.

చురుగ్గా రహదారి పనులు

కిర్లంపూడి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట నియోజకవర్గంలో రహదారి అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రత్తిపాడు ప్రధాన రహదారి నుంచి సింహాద్రిపురం రోడ్డు పనులు చురుగ్గా కొనసాగిస్తున్నారు. వెటమిక్స్ పూర్తి చేశారు. రూ.కోటి 25లక్షలతో ఈ పనులు ప్రారంభించారు. ఇంకా బీటీ రోడ్డుకు రెండు లేయర్లు వేయాలని వారం రోజుల్లో తారు రోడ్డు పనులు చేపట్టాలంటే బిల్లులు సకాలంలో మంజూరైతే ఈ పనులు వేగవంతంగా పూర్తి చేసే అవకాశముంది.

అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు చర్యలు: ఎంపీపీ

ప్రత్తిపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో దెబ్బతిన్న అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 3రోజుల పాటు నిర్వహించే శిక్షణాతరగతులను ఎంపీడీవో ఎంవీఆర్‌కుమార్ బాబుతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. సమావేశంలో ఏపీఎం వై.వెంకట్, ఎంఈవో వి.రాజబాబు, సూపర్‌వైజర్లు ఎస్.వరలక్ష్మి, మంగరత్నం, కె.సూర్యకుమారి పాల్గొన్నారు.